
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
ఆదివారం 4 ఫిబ్రవరి 2024



ఎర్రగుంట్లపల్లె సమీపంలోని అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగులు



గుట్టపాళెం సరిహద్దులో ఏనుగుల సంచారం

కలికిరి, ఫిబ్రవరి 3: మండలంలోని గుట్టపాళెం పంచాయతీ సామగుంటవారిపల్లె, వాల్మీకిపురం మండలం చింతపర్తి పంచాయతీ పరిధిలోని చారాల వాండ్లపల్లె, ఎర్రగుంట్లబావి, మేకలవారిపల్లె గ్రామాల సరిహద్దులో ఏనుగుల సంచారాన్ని గుర్తించినట్లు వాల్మీకిపురం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు. ఈ మేరకు ఈ రెండు పంచాయతీలకు చెందిన అటవీ ప్రాంతాలకు సమీపంలోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. రెండు గున్న ఏనుగులు ఎర్రగుంట్లపల్లె అటవీ ప్రాంతం నుంచి సామగుంట వారిపల్లె ప్రాంతం వైపు సంచరిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ అటవీ ప్రాంతం పరిసర గ్రామాల్లోని ప్రజలు ప్రధానంగా రైతులు ఒంటరిగా అటవీ ప్రాంతంలోకి వెళ్లరాదని సూచించారు. గొర్రెలు, మేకల పెంపకందార్లు కూడా తగు జాగ్రత్తలు పాటించాలని ఆయన కోరారు. ఆయా గ్రామ పంచాయతీల ప్రజలను అప్రమత్తం చేయడంలో సహకరించాల్సిందిగా కూడా విజ్ఞప్తి చేశారు. అటవీ ప్రాంతం లోపలికి ఎవరూ వెళ్లకుండా సూచనలు జారీ చేయాలని కోరారు. కాగా వాల్మీకిపురం, కలికిరి మండల పరిసరాల్లో ఏనుగుల సంచారాన్ని గుర్తించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం.

వాహనాల తనిఖీలో
బంగారు బిస్కెట్లు స్వాధీనం

రాజంపేట, ఫిబ్రవరి 3 : కారులో అక్రమంగా తరలిస్తున్న 1.338 కేజీల బంగారు బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నట్లు రాజంపేట అర్బన్ సీఐ మద్దయ్య ఆచారి శనివారం విలేకరులకు తెలిపారు. వాహనాలను తనిఖీ చేస్తుండగా నెంబరు ప్లేటు లేకుండా తిరుపతి నుంచి వస్తున్న కారును ఆపి తనిఖీ చేయగా కారులో సీటు కింద బంగారు బిస్కెట్లు ఉన్నట్లు గుర్తించామన్నారు.

కారు యజమాని కన్సేర్ మహ్మద్ జిలానీబాష, డ్రైవర్ షేక్ అజ్మత్‌లను విచారించగా బంగారానికి సంబంధించి ఎలాంటి బిల్లులు లేవని తెలిపారన్నారు. దీంతో దానిని స్వాధీనం చేసుకుని, రాయచోటిలోని జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్‌కు తదుపరి చర్యల నిమిత్తం పంపించామన్నారు.

28 మంది తహసీల్దార్లకు పోస్టింగులు

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 3: ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాల నుంచి వచ్చిన 28 మంది తహసీల్దార్లకు కలెక్టర్ అభిశిక్త్ కిశోర్ శుక్రవారం రాత్రి పోస్టింగ్స్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాల నుంచి వచ్చిన తహసీల్దార్లకు అన్నమయ్య జిల్లాలో పోస్టింగ్స్ ఇచ్చారు. ఎన్.ఈశ్వరమ్మను కురబలకోట తహసీల్దార్‌గా, ఎస్. రమాదేవిని మదనపల్లె తహసీల్దార్‌గా, ఈ.లక్ష్మీనాయక్ (పెద్దమండెం), మహబూబ్ బాషా (పీలేరు) , అనిల్‌కుమార్ (ములకలచెరువు), నయాజ్ అహ్మద్ (కేవీ పల్లె), విజయకుమారి (కలికిరి), బ్రహ్మయ్య (తంబళ్లపల్లె), శ్రీనివాసులు (పెద్దతిప్పసముద్రం), జి.పుణ్యవతి (బి.కొత్తకోట), కత్తిన్‌జూన్‌కృప వాల్మీకిపురం తహసీల్దార్‌గా పోస్టింగ్స్ ఇచ్చారు. అలాగే మహబూబ్‌బాషా (నందలూరు), శివరాముడు (రైల్వేకోడూరు), శ్రీనివాసులు (సంబేపల్లె), షేక్ జరీనా (సుండుపల్లె), శేషగిరిరావు (ఓబులవారిపల్లె), ఇన్బానాదం (రాజంపేట), బి.జయన్నను రాయచోటి తహసీల్దార్‌గా నియమించారు. అలాగే ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా శ్రీనివాసులును, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్‌గా ఆనంద్‌కుమార్‌ను, కలెక్టరేట్ ఏవోగా బాలాజీరాజును, మెజిస్టీరియల్ సెక్షన్ సూపరిండెంట్‌గా సక్సెనా, డీసీ కృష్ణమోహన్‌ను పీవోఎల్‌ఆర్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా, గోవిందసింగ్‌ను కోఆర్డినరేషన్ సెక్షన్ సూపరిండెంట్‌గా, బి.కొత్తకోట తహసీల్దార్ రఫీక్ అహ్మద్‌ను మదనపల్లె ఆర్డీవో ఆఫీస్ డీఏవోగా నియమించారు. జ్ఞానేశ్వరిని డీఏవోగా ఆర్డీవో కార్యాలయం రాజంపేటకు, వైసత్యానందం నందలూరు నుంచి కేఆర్‌ఆర్‌సీ సబ్‌కలెక్టర్ కార్యాలయం రాజంపేటకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అభిశిక్త్ కిశోర్



ఎన్నికల నిర్వహణలో
బీఎల్‌వో పాత్ర కీలకం : కలెక్టర్

రాజంపేట, ఫిబ్రవరి 3: ఎన్నికల నిర్వహణలో బీఎల్‌వో పాత్ర అత్యంత కీలకమని కలెక్టర్ అభిశిక్త్ కిశోర్ తెలిపారు. శనివారం ఉదయం రాజంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను, నందలూరు మండలం ఎర్రచెరువు పల్లె గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న బీఎల్‌వోలను ఎన్నికలకు సంబంధించిన వివిధ ఫారంల గురించి పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాలలో ఉండవలసిన సౌకర్యాలను పరిశీలించి, సౌకర్యాలలో ఎటువంటి లోపాలు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలు సజావుగా జరగాలంటే బీఎల్‌వోల పాత్ర ముఖ్యమని వారు నిర్వర్తించాల్సిన బాధ్యతలలో ఎటువంటి లోపాలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. అనంతరం రాజంపేట ఆర్డీవో కార్యాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో రాజంపేట ఆర్డీవో మోహన్‌రావు, మండల తహసీల్దార్ సుబ్రహ్మణ్యంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో ముస్లింలకు రక్షణ కరువు

● మాజీ మంత్రి అమరనాథరెడ్డి



మదనపల్లె సబ్‌జైలు వద్ద విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ మంత్రి అమరనాథరెడ్డి

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 3: వైసీపీ పాలనలో ముస్లిం మైనారిటీలకు రక్షణ కరువైందని, వారిపైనే అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారని మాజీ మంత్రి అమరనాథరెడ్డి ధ్వజమెత్తారు. శనివారం స్థానిక సబ్‌జైలులో రిమాండులో ఉన్న బైరెడ్డిపల్లె ముస్లిం నాయకుడు అమీర్‌జాన్‌ను మాజీ మంత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక స్థలం విషయంలో సర్పంచ్ భర్త అయిన అమీర్‌జాన్‌పై వైసీపీ నాయకులు దౌర్జన్యం చేశారన్నారు. అక్కడే ఉన్న ఏఎస్ఐ అడ్డుకోబోతే ఆయనపై కూడా వైసీపీ నాయకులు దాడి చేసేందుకు యత్నించారన్నారు. ఈ ఘటన వీడియోలు వైరల్‌గా మారినా కూడా బాధితులపైనే పోలీసులు అక్రమ కేసులు పెట్టారన్నారు. వైసీపీ నాయకులకు తొత్తులుగా మారి చట్టాన్ని, సెక్షన్లను వక్రీకరించారన్నారు. వైసీపీ పాలనలో చంద్రబాబుపైనే అక్రమ కేసులు పెట్టారన్నారు. తమపైనే నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టి జిల్లాలో లేకుండా చేశారన్నారు. సొంత చెల్లెలు, తల్లినే వైసీపీ నాయకులు దూషిస్తుంటే జగన్ చూస్తూ ఊరుకున్నారన్నారు. జగన్ దారుణ పాలనను అంతం చేయాలంటే రాష్ట్రం నుంచి తరిమి కొట్టాలన్నారు. సొంత వర్గాలకే న్యాయం చేయలేని జగన్ సామాన్య ప్రజలకు ఏమి న్యాయం చేస్తారని ప్రశ్నించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్, దేవరింటి శ్రీనివాసులు, దొరస్వామినాయుడు, కురవంక మోహన తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను దగా చేసేందుకే
మెగా డీఎస్సీ డ్రామా

రాష్ట్రంలోని నిరుద్యోగులను దగా చేసేందుకే వైసీపీ ప్రభుత్వం మెగా డీఎస్సీ పేరుతో డ్రామాకు తెరలేపిందని మాజీ మంత్రి ఎన్.అమరనాథరెడ్డి తప్పుపట్టారు. శనివారం స్థానిక అన్నమయ్యసర్కిల్ వద్ద టీడీపీ కార్యాలయానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ యువతకు మంచి భవిష్యత్ ఇవ్వాల్సిన ప్రభుత్వం గంజాయి, మద్యం బానిసలుగా మార్చి వారి భవిష్యత్‌ను అంధకారంలోకి తోసేసిందన్నారు. ఈ రాష్ట్రం బాగుపడాలంటే నిరుద్యోగులకు ఉజ్వల భవిష్యత్ రావాలంటే మళ్లీ చంద్రబాబును సీఎం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ మాట్లాడుతూ సంక్షేమం పేరిట అభివృద్ధిని తుంగలోకి తొక్కిన ప్రభుత్వం రూ.లక్ష కోట్లు అప్పులు చేసిందని, రాష్ట్రంలోని ఐదుకోట్ల మందిపై తలకు రూ.2 లక్షల చొప్పున అప్పు పెట్టిందన్నారు. సమావేశంలో దొమ్మలపాటి యశశ్విరాజ్, పట్టణ, మండల అధ్యక్షుడు జోశెపాలెం భవానీప్రసాద్, దేవరింటి శ్రీనివాసులు, నీలకంఠ, తులసీధర్‌నాయుడు, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాసాగర్ హాస్పిటల్‌లో రోబోటిక్ సేవలు

● రోబోటిక్ టెక్నాలజీతో కచ్చితత్వంగా శస్త్ర చికిత్సలు ● విద్యాసాగర్ ఆర్థోపెడిక్ హాస్పిటల్ డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి



కడప (మారుతీనగర్), ఫిబ్రవరి3: కడపలోని తమ హాస్పిటల్‌లో ప్రప్రథమంగా అత్యాధునిక ప్రపంచస్థాయి రోబోటిక్ టెక్నాలజీ ద్వారా కచ్చితత్వంగా మోకాలు, తుంటి కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు విద్యాసాగర్ ఆర్థోపెడిక్ హాస్పిటల్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ సి.విద్యాసాగర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఉదయం కడప నగరం, రాజీవ్‌మార్గ్ సోనోవిజన్ దగ్గర గల విద్యాసాగర్ ఆర్థోపెడిక్ హాస్పిటల్‌లో రోబోటిక్ టెక్నాలజీని మోకాలు, తుంటి కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సల విభాగాన్ని ప్రారంభించారు. అమెరికా వారి స్మిత్ & నెఫ్యూ కంపెనీకి చెందిన కోరి రోబోటిక్ సిస్టంని కొన్ని రోజులుగా ఉపయోగించి సత్ఫలితాలను రాబట్టారు. శనివారం హాస్పిటల్‌కు వచ్చిన వారందరికీ రోబో పరికరాన్ని చూపించి దాని పనితీరును వివరించారు. రోబోటిక్ టెక్నాలజీ ద్వారా మోకీలు శస్త్ర చికిత్స చేయించుకున్న పేషెంట్స్ తమ సంతృప్తిని, సంతోషాన్ని వచ్చిన వారందరితో పంచుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ విద్యాసాగర్ రెడ్డి మాట్లాడుతూ కోరి రోబోటిక్ ద్వారా మోకీలు మార్పిడి (టోటల్ రీప్లేస్‌మెంట్), తుంటి, కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స (టోటల్ హిప్ రీప్లేస్‌మెంట్), రివిషన్ని రీప్లేస్‌మెంట్‌లు, సి.టి. రేడియేషన్ అవసరం లేకుండా రియల్ ఇంటలిజెన్స్ హ్యాండ్ హోల్డ్ రోబోటిక్ ఆర్మ్ ఉపయోగించి శస్త్ర చికిత్సలు చేయగలమని వివరించారు. మూడు నాలుగు సంవత్సరాలు దేశ, విదేశాలలో రోబోటిక్ టెక్నాలజీపై గడించిన విశేష అనుభవం, రోబోటిక్ టెక్నాలజీని డిజైన్ చేసిన బృందంతో చర్చల తర్వాత తమ హాస్పిటల్‌కు తీసుకువచ్చామన్నారు. రోబోటిక్ టెక్నాలజీతో తక్కువ కోత తక్కువ బోన్‌లాస్, తక్కువ టిష్యూలాస్‌తో సక్రమమైన ఇంప్లాంట్ అమరికతో మోకాలుకు అధిక స్థిరత్వాన్ని చేకూర్చవచ్చన్నారు. దీని ద్వారా నూరు శాతం కచ్చితత్వం, త్వరితగతిన రికవరీ, తక్కువ నొప్పి దీర్ఘకాలిక మన్నిక, సాధారణ మోకాలు అనే భావన, సునాయసమైన మోకాలు కదలికలు, సంతృప్తికరమైన సత్ఫలితాలు ఉంటాయని వివరించారు. 15 సంవత్సరాలుగా తమ హాస్పిటల్‌లో నిష్ణాతులైన వైద్యబృందం ద్వారా సుమారు 5,800 కిపైగా మోకీలు మార్పిడి శస్త్ర చికిత్సలు చేశామన్నారు. ఇంపోర్టెడ్ మోకీలు పరికరాలు, లామినార్ ఎయిర్ ఫ్లోథియేటర్స్, అత్యాధునిక సదుపాయాలతో 50 పడకలు ఆసుపత్రిలో ఉన్నాయని తెలిపారు. సమావేశంలో డాక్టర్ ఎన్.శ్రీలక్ష్మి, సురేశ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి. చిత్రంలో డాక్టర్ శ్రీలక్ష్మి, ఎన్.సురేశ్‌కుమార్‌రెడ్డి

ప్రజలకు సేవ చేసేందుకే
రాజకీయాల్లోకి వచ్చా...

● ప్రచారంలో దూసుకుపోతున్న నగిరిపాటి రేవతి
● చంద్రన్న సంక్షేమ ఫలాలు, ప్రజలకు వరాలు
● రేవతికి బ్రహ్మారథంపడుతున్న ప్రజలు

రైల్వేకోడూరు : ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లో వచ్చాను. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల హామీలను, గత టీడీపీ ప్రభుత్వంలో చేసిన అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారంలో ముందుకు దూసుకుపోతున్న రైల్వేకోడూరు నియోజకవర్గ టీడీపీ మహిళా నాయకురాలు నగిరిపాటి రేవతి. ప్రతి గ్రామంలోను రేవతికి ప్రజలు బ్రహ్మారథం పడుతున్నారు. తన తండ్రి నగిరిపాటి సుబ్రహ్మణ్యం మాజీ తహసీల్దార్‌గా నాలుగు మండలాల్లో పనిచేసి ప్రజలకు సేవచేశారు. వీరి కుటుంబానికి ఐదు మండలాల్లో బంధుత్వం బలంగా ఉంది. వీరి స్వగ్రామం రైల్వేకోడూరు మండలంలోని ఉప్పరపల్లె పంచాయితీ పరిధిలోని మారావారిపల్లె అరుంధతివాడ. రేవతి ఎంబీఏ వరకు చదువుకుని కెనడాలో టెలికాం రంగంలో ఉద్యోగం చేసేవారు. అన్ని రంగాలను అభివృద్ధి చేసిన విజనరీ లీడర్ చంద్రబాబు స్ఫూర్తితో యువత రాజకీయాల్లోకి రావాలని యువ నాయకుడు టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు నారా లోకేష్ పిలుపుమేరకు తన ఉద్యోగానికి రాజీనామాచేసి స్వగ్రామం అయిన మారావారిపల్లెకు వచ్చేశారు. నాలుగు మండలాల్లో తహసీల్దార్‌గా పనిచేసిన సుబ్రహ్మణ్యంకు మంచి సన్నిహిత సంబంధాలు ఉండడంతో పాటు సుపరిచితులు కావడంతో పార్టీకి మంచి విజయం అవకాశాలున్నాయి. చంద్రబాబును ముఖ్యమంత్రిగా చూడాలని ప్రజలు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌ఛార్జ్ కస్తూరి విశ్వనాథనాయుడు ఆశీస్సులతో నగిరిపాటి రేవతి ముందుకు దూసుకునిపోతున్నారు. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట, చిట్వేలి, పెనగలూరు మండలాల్లో టీడీపీ బలోపేతం కోసం ముమ్మరంగా కృషి చేస్తున్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే చంద్రబాబు సహకారంతో నియోజకవర్గంలో ఉద్యాన పంటలకు కేంద్ర బిందువు అయిన రైల్వేకోడూరు ప్రాంతంలో శీతల గిడ్డంగులు ఏర్పాటు, ఉద్యాన హబ్ కృషిచేస్తాము. రైల్వేకోడూరు-చిట్వేలి డబుల్‌రోడ్డు, పెండింగ్‌లో ఉన్న కోడూరు-వెంకటగిరిరోడ్డు, రైల్వేఅండర్ బ్రిడ్జి, ప్రభుత్వ మార్కెట్ యార్డు, కోడూరులో అండర్ డ్రైనేజి తదితర వాటిని ఏర్పాటు కృషి చేస్తాం. మంగంపేట ఏపీయండీసీ ముగ్గురాళ్ల గనుల్లో అవినీతి, అక్రమాలు జరగకుండా చూస్తాం. ఎర్రచందనం దోపిడి, స్మగ్లింగ్ అరికట్టేందుకు గట్టిచర్యలు తీసుకుంటాము. అలాగే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాము. నియోజకవర్గంలో టీడీపీని బలోపేతం చేయడానికి గ్రామాల్లో ముమ్మరంగా తిరుగుతున్నారు. పార్టీ టిక్కెట్టు వస్తే ప్రజలకు సేవ చేయడానికి లక్ష్యంగా పెట్టుకుంటాము. నగిరిపాటి రేవతికి బలగం ఐదు మండలాల్లో పుష్కలంగా ఉన్నాయి. ప్రతిరోజు గ్రామాల్లో అలుపు లేకుండా పార్టీ కోసం తిరుగుతున్నారు. ఐదు మండలాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులతో కలిసి మెలసి ముందుకు పోతున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక కార్యక్రమాలు ప్రజలకోసం చేస్తాము. అందరిని కలుపుకుని ప్రచారంలో దూసుపోతున్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాము. యువత మత్తుపదార్థాలకు గురికాకుండా మంచి భవిష్యత్తును కల్పించే విధంగా టీడీపీ ప్రభుత్వంద్వారా అవకాశాలు కల్పిస్తాము. దళితవాడలు, గిరిజన కాలనీలు తదితర గ్రామాలను అభివృద్ధి పథంలోకి నడిపిస్తాము. పేద, బలహీన, బడుగు వర్గాలకు మంచి చేసేందుకు నడుం బిగిస్తాము. ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు అక్కున చేర్చుకుని వారికి అండగా నిలబడతాము. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పెట్టుకుని గ్రామాల్లో తిరుగుతున్నాము. టీడీపీ టిక్కెట్టు ఎవరికిచ్చినా పార్టీ కోసం పనిచేస్తాము. రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో ముందుకు నడిపించేందుకు కృషిచేస్తా. టీడీపీకి పూర్వ వైభవం తీసుకుని వచ్చేందుకు కృషి చేస్తాము. ప్రచారంలో పేదోళ్ల కష్టాలను నోట్ చేసుకుని టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యలు పరిష్కారం చేస్తామని రేవతి తెలిపారు.. (ADVT.)



చంద్రబాబుతో టీడీపీ మహిళా నాయకురాలు రేవతి



పేదల కష్టాలను తెలుసుకుంటున్న నగిరిపాటి రేవతి



రైల్వేకోడూరు నియోజకవర్గం లో ప్రచారం చేస్తున్న నగిరిపాటి రేవతి



దుకాణ సంస్థల ఏర్పాటుకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

కార్మిక శాఖ ఉప కమిషనర్ శ్రీకాంత్‌నాయక్


దుకాణాల సంఘ సభ్యులతో మాట్లాడుతున్న శ్రీకాంత్‌నాయక్

కడప (చిన్నచౌకు), ఫిబ్రవరి 3: జిల్లాలోని దుకాణాల సంస్థలను ఏర్పాటు చేసే వారు దుకాణాల సంస్థల చట్టం 1988 ప్రకారం తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని కార్మికశాఖ ఉప కమిషనర్ శ్రీకాంత్‌నాయక్ తెలిపారు. శనివారం ఆయన పాత రిమ్స్‌లో గల కార్మిక శాఖ కార్యాలయంలో వివిధ వర్తక యాజమాన్య సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుకాణాల సంస్థలు ఏర్పాటు చేసుకునేవారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఇందుకోసం కార్మిక శాఖ కార్యాలయంలో నమోదు చేసుకుని రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈనెల 29లోపు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కిరాణా మర్చంట్, ఫార్మా మెడికల్ సంబంధించిన యాజమాన్య సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

భూమిలోకి కుంగిన బోరు


భూమిలోకి కుంగిపోయిన బోరు

సంబేపల్లె, ఫిబ్రవరి 3: ప్రజల తాగునీటి వసతి కోసం వేసిన తాగునీటి బోరు అది. ఉన్నట్టుండి ఎనిమిది అడుగుల లోతుకు కుంగిపోయింది. దుద్యాల గ్రామం పెద్దజంగంపల్లెలో శనివారం ఈ ఘటన జరిగింది. ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఏడాదిన్నర క్రితం జలజీవన్ మిషన్ కింద బోరు వేసి, మోటారు బిగించారు. శనివారం ఉన్నట్టుండి ఆ ప్రాంతంలో భూమి కుంగిపోవడంతో బోరు ఎల్‌బెండ్ సాయంతో నిలబడినట్టు స్థానికులు తెలిపారు. ఎల్‌బెండ్ లేకుంటే మరింత లోతుకు వెళ్లిపోయేదని తెలియజేశారు.

నియోజకవర్గంలో బండలు, గుట్టలు, రాళ్లు ఉండడంతో భూమి గట్టిగా ఉంటుంది. కుంగిపోవడానికి ఆస్కారం ఉండదు. బోరు వేసే సమయంలో గట్టి నేల తగిలే వరకు కేసింగ్ పైపు వేస్తారు. కాగా ఉమ్మడి కడప జిల్లాలో సీకే దిన్నె మండలంలో గతంలో వర్షాకాలంలో భూమి కుంగినట్లు తెలిసిందే. బోరు భూమి లోపలికి పోవడంతో గొయ్యి ఏర్పడిందని స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బోరు వేసే సమయంలో సంబంధిత కాంట్రాక్టర్ కేసింగ్‌ను భూమి గట్టిగా ఉన్నంతవరకు వేయకపోవడం కూడా కారణమై ఉండవచ్చునని స్థానిక ప్రజలు తెలిపారు. బోరు కుంగిపోవడానికి కారణాన్ని అధికారులు పరిశీలించాల్సి ఉంది.

వైవీయూ ఇంజనీరింగ్ కళాశాల ఫలితాలు విడుదల


ఫలితాలను విడుదల చేస్తున్న దృశ్యం

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 3 : వైవీయూ పరిధిలోని ప్రొద్దుటూరు వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ మొదటి సెమిస్టరు ఫలితాలను వైస్ చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ విడుదల చేశారు. 81.66 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. సివిల్, సీఎస్ఈ, ట్రిబుల్‌ఈ, ఈసీఈ, ఎంఈ, ఎంఎంటీ బ్రాంచ్‌లలో 240 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 196 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. సివిల్స్‌లో 85.71 శాతం, కంప్యూటరు సైన్స్‌లో 91.90 శాతం ట్రిబుల్‌ఈలో 74.41 శాతం, ఈసీఈలో 65.21, ఎంఈలో 78.78 శాతం, ఎంఎంటీలో వంద శాతం మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ఈ సందర్భంగా పరీక్షల విభాగాన్ని అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రారు ప్రొఫెసరు వైపీ వెంకటసుబ్బయ్య, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, ఇంజనీరింగ్ కళాశాల డీన్ ప్రొఫెసరు రమణయ్య పాల్గొన్నారు.

పుష్పగిరి హుండీ ఆదాయం లెక్కింపు

వల్లూరు, ఫిబ్రవరి 3 : పవిత్ర పుణ్యక్షేత్రమైన పుష్పగిరి కొండపై వెలసిన శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. చెన్నకేశవస్వామి ఆలయంలో దేవదాయ శాఖ అధికారులు, భక్తుల సమక్షంలో ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీల ద్వారా భక్తులు స్వామి వారికి సమర్పించిన కానుకలను లెక్కించారు. ఇందులో రూ.3,21,795 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్, అర్చకులు అఖిల్‌దీక్షితులు, సుమంత్ దీక్షితులు, పురావస్తుశాఖ, దేవదాయశాఖ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కలిచెర్లవాసి దుబాయ్‌లో గుండెపోటుతో మృతి


షబ్బీర్ వలీ (ఫైల్)

పెద్దమండ్యం, ఫిబ్రవరి 3: పెద్దమండ్యం మండలం కలిచెర్లకు చెందిన షబ్బీర్‌వలీ (38) దుబాయిలో గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు శనివారం తెలిపారు. షబ్బీర్‌వలీకి భార్య, ఆరుగురు పిల్లలు ఉన్నారు. ఇతను కుటుంబ పోషణకు రెండు నెలల క్రితం దుబాయికి వెళ్లాడు. అక్కడ ఈనెల 2వతేదీ శుక్రవారం నమాజ్‌కు వెళ్లి తిరిగి రూమ్‌కు వెళ్లిన అనంతరం గుండెపోటు వచ్చి గంట వ్యవధిలోనే కుప్పకూలిపోయి మృత్యువాత పడినట్లు సమాచారం వచ్చిందని కుటుంబసభ్యులు తెలి పారు. బాధిత కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. ప్రభుత్వం చర్యలు తీసుకొని నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పలు విభాగాలను తనిఖీ చేసిన వైవీయూ వీసీ

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 3 : వైవీయూలో శనివారం వైస్ చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ పలు విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నియంత్రణ అధికారి పర్యవేక్షణలో జరుగుతున్న డిగ్రీ పరీక్షల మూల్యాంకన కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం సైన్స్ బ్లాక్‌లోల బయో టెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్స్ ఎన్విరాన్‌మెంటల సైన్స్ విభాగ తరగతులు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఇంజనీరింగ్ విభాగం పరిశీలించి రికార్డులు చూసి అధికారులకు పలు సూచనలు అందించారు.

గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జమ్మలమడుగు, ఫిబ్రవరి 3: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ 2024-25 విద్యాసంవత్సరానికి 5వ తరగతి, జూనియర్ ఇంటర్మీడియట్ ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గుండ్లకుంట గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభావతి తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయం గుండ్లకుంట పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి 5వ తరగతి, జూనియర్ ఇంటర్మీడియట్ ఇంగ్లీషుమీడియంలో బాలబాలికల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక జరుగుతుందన్నారు. అర్హతగల ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ అభ్యర్థులు 25.1.2024 నుంచి 23.2.2024 వరకు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఇతరు వివరాలకు 9704550130 నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవాలన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

కడప (క్రైం), ఫిబ్రవరి 3 : ఒంటిమిట్ట-భాకరాపేట రైల్వేస్టేషన్ల మధ్య ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు కడప రైల్వే పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు... తమిళనాడు రాష్ట్రం రామానంతపురం జిల్లా ఇమనేశ్వరంలోని సిలోన్ కాలనీకి చెందిన బాలాజీ కుజిల్లా (25) ఒంటిమిట్ట సమీపంలో రైలు కింద పడి మృతి చెందాడు. అతడి శరీరం రెండు ముక్కలైంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు.

రైల్లో నుంచి జారి పడి వ్యక్తి మృతి : కడప రైల్వేస్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి రైలు నుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. రాజస్థాన్ రాష్ట్రం లోడా గ్రామానికి చెందిన సురేశ్‌కుమార్ (42)గా గుర్తించినట్లు కడప రైల్వే పోలీసులు తెలిపారు.

11 మంది కోడి పందెం రాయుళ్ల అరెస్ట్

గుర్రంకొండ, ఫిబ్రవరి 3: కోడిపందేలపై పోలీసులు దాడులు నిర్వహించి 11 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. మండలంలోని చెర్లోపల్లి సమీపంలో కోడి పందెం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు చేసి 11 మందిని అరెస్టు చేసి, రూ.7550 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

'బొల్లవరం'.. అభివృద్ధికి సుదూరం

అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని అన్న చందాన ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిస్థితి ఉంది. కోట్ల రూపాయల ఆస్తులున్నా వాటిని సంరక్షించి ఆదాయాన్ని పెంచుకునే దిశగా చర్యలు లేవు. ఆఖరికి కోట్ల రూపాయల ఆదాయం వచ్చిన బొల్లవరం మున్సిపల్ లేవుట్‌లో కనీస వసతులైన రోడ్లు, విద్యుత్, తాగునీటి సదుపాయం ఏర్పాటు చేయలేదు. దీంతో వందల కోట్ల విలువ చేసే స్థలాలు ఇక్కడ నిరుపయోగంగా ఉన్నాయి.

ప్లాట్లలో ఏపుగా పెరిగిన జంబు పిచ్చిమొక్కలు


ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 3: ప్రొద్దుటూరులో హడ్కో రుణంతో జమ్మలమడుగు మెయిన్ రోడ్డును ఆనుకుని బొల్లవరం రెవెన్యూ పొలంలో దాదాపు 85.15 ఎకరాల భూములను మున్సిపాలిటీ కొనుగోలు చేసింది. ఆ భూములను మొత్తం 761 ప్లాట్లుగా విభజించారు. ఇందులో ఓపెన్‌స్పేస్ కింద పది శాతం 8.50 ఎకరాల భూములను పార్కులు, సామాజిక అవసరాల కోసం వదిలారు. 24.74 ఎకరాలను విశాలమైన రోడ్ల నిర్మాణం కోసం వదిలారు. ఇందులో హెచ్‌ఐజీ ప్లాట్లు 95, ఎంఐజీ ప్లాట్లు 147 ఏర్పాటు చేశారు. వీటిని సెంట్ల వారీగా 7.5 సెంట్లు, 5.5 సెంట్లు, 2.5 సెంట్లు ప్లాట్లుగా విభజించి బహిరంగ వేలం వేసి విక్రయించారు. 2007-2008 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన వేలం పాటల్లో సెంటు రూ.70 వేల నుంచి రూ.2లక్షల విలువతో విక్రయించారు. మొత్తం 761 ప్లాట్లలో 243 ప్లాట్లను విక్రయించారు. ఇంకా 518 ప్లాట్లు ఉన్నాయి. విక్రయించిన ప్లాట్లకు నాడు రూ.14 కోట్ల మేర మున్సిపాలిటీకి ఆదాయం సమకూరింది.

రూ.5 కోట్లతో పనులు

బొల్లవరం మున్సిపల్ లేఅవుట్‌లో ప్లాట్ల విక్రయం ద్వారా వచ్చిన ఆదాయంతో అక్కడ రూ.5కోట్లతో మెటల్ రోడ్లు, విద్యుత్ స్తంభాలు, తాగునీటి పైప్‌లైను పనులు చేపట్టారు. లేఅవుట్‌లో ప్రత్యేకంగా ఓవర్‌హెడ్ టాంక్ నిర్మాణం మొదలుపెట్టారు. ఏమైందో ఏమోకానీ ఈ పనులు అసంపూర్తిగా వదిలేశారు. మున్సిపాలిటీ మౌలిక వసతులు కల్పించకపోవడంతో ప్లాట్లు కొన్నవారు ఇక్కడ నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో ఇక్కడ విద్యుత్ తీగలు చోరీకి గురయ్యాయి. పైపులైను నిర్వహణలేక లీకులతో నీళ్లన్నీ ప్లాట్లలో చేరి జంబు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. మౌలిక వసతులు కల్పించాలంటూ అక్కడ స్థలాలు కొనుగోలు చేసిన వారు అనేకమార్లు వినతులు అందజేసినా అధికారులు కానీ పాలక మండలి కానీ పట్టించుకోలేదు.

తొలగిన హద్దురాళ్లు

మున్సిపల్ లేఅవుట్‌లో 16ఏళ్లక్రితం వేసిన ప్లాట్లరాళ్లు తొలగిపోయి హద్దులు చెరిగిపోయాయి. అంతేకాకుండా ఓ రాజకీయ పార్టీ సమావేశం ఆ ప్లాట్లలో ఏర్పాటు చేయడం వల్ల కూడా కొంత భాగం రాళ్లు తొలగిపోయాయి. అంతేకాకుండా అక్కడ ఖాళీ స్థలాల్లో ప్రైవేటు వ్యక్తుల భవన నిర్మాణ వ్యర్థాలు పెద్దఎత్తున వేశారు.

ప్లాట్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం..

బొల్లవరం మున్సిపల్ లేఅవుట్ స్థలాలు నేడు మార్కెట్‌లో భారీగా విలువ చేస్తాయి. ఈ లేఅవుట్ భూములన్నీ ఏడాది క్రితమే నిషేధిత జాబితా నుంచి తొలగిపోయాయి. కౌన్సిల్లో లేఅవుట్ అభివృద్ధి పనులకు ఆమోదం తీసుకుని రోడ్లు, విద్యుత్, తాగునీటి వసతి, గ్రీనరీ ఏర్పాటుకు చర్యలు చేపడతాం..

- వెంకటరమణయ్య, మున్సిపల్ కమిషనర్, ప్రొద్దుటూరు

నిషేధిత జాబితాలో పెట్టిన కారణంగా..

మున్సిపాలిటీ కొనుగోలు చేసిన 85.15 ఎకరాల భూముల్లో 70.09 ఎకరాలు పట్టా ల్యాండ్ ఉంది. అందులో 52.46 ఎకరాలు 22 ఏ కింద ఉండటంతో ఆ భూముల్లో విక్రయాలు ఆగిపోయాయి. దీంతో గత ఏడాది మున్సిపల్ అధికారులు జిల్లా కలెక్టర్‌కు రిపోర్టు పంపడంతో వాటిని 22 ఏ జాబితా నుంచి తొలగించారు. ఇంకా ఇందులో 4.90ఎకరాలు చుక్కల భూమి, 9.10 ఎకరాల ఇనాం భూమి, ఒక ఎకరా రస్తా పోరంబోకు ఉంది. రస్తా పోరంబోకు తప్ప అన్ని భూములు ఎలిమినేట్ అయ్యాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకోవడంతో కొన్నేళ్లుగా బొల్లవరం లేఅవుట్‌లో స్థలాలకు భారీగా రేట్లు వచ్చాయి. అప్పట్లో సెంటు రూ.70 వేల నుంచి రెండు లక్షల వరకు పోతే నేడు సెంటు పది లక్షలు పలుకుతోంది.

- ప్లాట్ల విక్రయాల్లో రూ.14 కోట్ల ఆదాయం
- లే అవుట్‌లలో మట్టిరోడ్లు కూడా ఏర్పాటు కాని వైనం
- కనీసం నెంబరు రాళ్లు కానరాని దుస్థితి
- స్థలాల్లో పెరిగిన జంబు, కంపచెట్లు
- ఆదాయం తప్ప... అభివృద్ధి పట్టని అధికారులు
- ఇదీ బొల్లవరం మున్సిపల్ లేఅవుట్ దుస్థితి


అసంపూర్తిగా నిలిపోయిన వాటర్‌ట్యాంక్

ఈ మున్సిపల్ లేఅవుట్ చుట్టూ పెద్దఎత్తున కాలనీలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం ఆ ప్లాట్లు అభివృద్ధి చేసి బహిరంగ వేలం పెడితే మున్సిపాలిటీకి వందల కోట్ల రూపాయల ఆదాయం వస్తుంది. పెద్ద లేవుట్ అభివృద్ధి చేయడం ద్వారా పన్నులు రూపేణా ఆదాయం సమకూరుతుంది. ఆ దిశగా మున్సిపాలిటీ వారు చర్యలు తీసుకోవాలని ఇక్కడ ప్లాట్లు కొన్నవారు కోరుతున్నారు.


మున్సిపల్ లేఅవుట్ ముఖద్వారం


ప్లాట్ల స్థలాల్లో భవన నిర్మాణ వ్యర్థాలు


లేఅవుట్‌లోని పార్కు దుస్థితి

వేర్వేరుచోట్ల 72 గోవా మద్యం బాటిళ్లు పట్టివేత



కడపలో స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు - రాజంపేటలో స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 3 : వాస్కోడిగామా నుంచి తిరుపతి వెళుతున్న రైలు నెం.17420లో అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని కడప రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. శనివారం కడప రైల్వేస్టేషన్‌లో మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు రైల్వే సీఐ నాగార్జున తెలిపారు. గుంతకల్లు రైల్వే డీఎస్పీ షేక్‌షా ఆదేశాల మేరకు కడప ప్రయాణికుల వస్తువులను సోదా చేశామన్నారు. వాస్కోడిగామా నుంచి తిరుపతికి వెళుతున్న రైలు నుంచి ఓ వ్యక్తి కడప రైల్వేస్టేషన్‌లో దిగారన్నారు. అతడి బ్యాగును సోదా చేయగా 10 మద్యం బాటిళ్లు ఉన్నట్లు తెలిపారు.

ఆ బాటిళ్లను సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపినట్లు తెలిపారు. దాడుల్లో ఆర్ఎస్ఐలు విజయనరసింహ, రవిచంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. వారిని సీఐ అభినందించారు.

గోవా మద్యం స్వాధీనం, ఒకరి అరెస్టు

రాజంపేట, ఫిబ్రవరి 3: రాజంపేట మండలంలోని ఊటుకూరు పంచాయతీలో శనివారం దాడులు నిర్వహించి 72 గోవా మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సంధ్య తెలిపారు. మద్యం బాటిళ్లు కలిగి ఉన్న వెంకటరాజంపేట గ్రామానికి చెందిన కట్టా నారాయణను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ మద్యం ఎవరు సరఫరా చేశారు అనే విషయంపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దాడుల్లో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ హెడ్ కానిస్టేబుల్ పృథ్వీ, సిబ్బంది రమణ, చిదంబరయ్య, రంగయ్య, ప్రమీల పాల్గొన్నారు.

మాకు పునరావాసం కల్పించరా...!

- ఏపీఎండీసీ ఎండీని నిలదీసిన ప్రజలు


ఏపీఎండీసీ ఎండీ వెంకటరెడ్డిని నిలదీస్తున్న గ్రామస్తులు

ఓబులవారిపల్లి, ఫిబ్రవరి 3: ఏపీఎండీసీ సంస్థ అభివృద్ధికి సహకరించిన అగ్రహారం గ్రామ తరలింపులో అన్యాయం చేస్తున్నారని ఎండీ వెంకటరెడ్డిని గ్రామస్థులు నిలదీశారు. శనివారం ఏపీఎండీసీ ప్రాంగణంలోని రామాలయం లో ఎండీ కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడికి వచ్చిన అగ్రహారం గ్రామస్థులు ఆయనతో మాట్లాడుతూ ఏపీఎండీసీ సంస్థ కోసం తమ భూములను, ఇళ్లను విడిచి పెట్టినందుకు తగిన శాస్తి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

శాశ్వత పరిష్కారం చూపకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంస్థ అభివృద్ధి కోసం ఇప్పటికే మూడుసార్లు మారామని తమ కుటుంబాలకు పునరావాసం కల్పించడంలోనూ, ఉద్యోగం, ఉపాధి కల్పించడంలోనూ సంస్థ పూర్తిగా అన్యాయం చేస్తోందని, మాకు న్యాయం జరగకుండా అడ్డుపడుతున్నారని ఎండీకి తమ బాధలు వివరించారు. 2022 నవంబరు 17 తేదీ గోడ కూలి మృతి చెం దిన బాబు కుటుంబానికి ఇప్పటి వరకు శాశ్వత ఉద్యోగం కల్పించలేదన్నారు. డేంజర్‌జోన్‌లో ఉండే కాపుపల్లి, హరిజనవాడ, అరుంధతి వాడ గ్రామాలకు చేసిన ఏర్పాట్లు తమకు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. తమ గ్రామా ల తరలింపులో మొదట ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఆర్ఆర్ చట్టం ప్రకారం ప్రస్తుత రేట్లలో 50 శాతం చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే మైనింగ్ ప్రక్రియను అడ్డుకుంటామని గ్రామస్థులు హెచ్చరించారు. సమస్యలపై సోమవారం సమీక్ష నిర్వహిస్తామని ఎండీ వెంకటరెడ్డి హామీ ఇవ్వడంతో గ్రామస్థులు వెనుదిరిగారు. కార్యక్రమంలో సీపీవో సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ పోకూరు సుబ్రహ్మణ్యం, అనిల్ స్వామి, మురళి, రాధమ్మ, బొక్కసం అనిల్‌కుమార్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అది మెగా కాదు.. దగా డీఎస్సీ

- నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ధ్వజం


పీలేరు, ఫిబ్రవరి 3: రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నిరుద్యోగులను మరోసారి మోసం చేయడానికి మెగా డీఎస్సీ పేరుతో సీఎం జగన్ మరోసారి మోసానికి తెరతీశారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. తాను అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని మభ్యపెట్టారని గుర్తు చేశారు. ఐదు జనవరి నెలలు వచ్చి వెళ్లినా ఇన్నాళ్లు పోస్టుల భర్తీ గురించి పట్టించుకోకుండా మళ్లీ ఎన్నికల సమయంలో నిరుద్యోగులపై వల వేశారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో మొత్తం 50 వేల 892 టీచరు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు కేంద్రం గుర్తించిందని, ఇప్పుడు ముఖ్యమంత్రి కేవలం 6100 పోస్టుల భర్తీకి డీఎస్సీని నిర్వహిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ విధమైన నోటిఫికేషన్లు ఇవ్వడం నిరుద్యోగులను తప్పుదోవ పట్టించడమేనని స్పష్టం చేశారు. జాబ్ క్యాలెండరు ప్రకటించి 2.32 లక్షల ఉద్యోగాల భర్తీ ఏమయిందని ప్రశ్నించారు. ఉద్యోగాలు రాకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా 1745 మంది నిరుద్యోగులు జీవితం మీద విరక్తితో బలవన్మరణాలకు పాల్పడ్డారన్నారు. పేద ప్రజల నిత్యావసరాల ధరలు ఇష్టానుసారం పెంచేసి, కల్తీ మద్యం అమ్మకాలతో వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారని దుయ్యబట్టారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పాలని కోరారు.

అవకతవకలు లేకుండా పంపిణీ

రేషన్ పంపిణీని తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్


రేషన్ పంపిణీని తనిఖీ చేస్తున్న జేసీ గణేశ్‌కుమార్

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 3: అవకతవకలు లేకుండా ప్రజలకు రేషన్ పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్ తెలిపారు. శనివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని పులివెందుల ఆర్డీవో వెంకటేశులుతో కలిసి జేసీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి రేషన్ అందించాలన్నారు. ప్రతి ఒక్కరికీ అందాలన్న లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. తూకాల్లో తేడాలు వస్తున్నాయని ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవన్నారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి జగనన్న హౌసింగ్ లేఅవుట్‌కు సంబంధించి కొత్తగా అర్హులైన వారికి ఆన్‌లైన్‌లో ఎక్కించాల్సిన విషయంపై సబ్ రిజిస్ట్రార్ నజీర్‌తో మాట్లాడారు. ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే వెంటనే పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సుజీత్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



WANTED
కడపజిల్లా పెండ్లిమర్రి - 516216, నంది మండలం-516218,చెన్నూరు-516162 నందు DTDC కొరియర్ సంస్థనుండి బ్రాంచ్‌కోసం ఈ క్రిందినెంబర్‌కు సంప్రదించండి :73373 53420
Ajc-000

WANTED TEACHERS
Wanted Lady Teacher B.A., B.Com., B.Sc. to teach 1st to Vth Classes All Subjects. కడప లోకల్‌వారికి ప్రాధాన్యత సెల్:9494282634
Ajc-176327

పాస్‌పోర్టు పోయినది
పందిర్లపల్లి మంజులత D/o పందిర్లపల్లి రామచంద్రారెడ్డి D.No. 5/182-3, 2nd ఫ్లోర్, గీతాశ్రమము వీధి, ప్రొద్దుటూరు కడపజిల్లా, పాస్‌పోర్టు నెం.J1211288 పాస్‌పోర్ట్ పోయినది. దొరికిన వారు తెచ్చివ్వగలరు. సెల్ : 81259 50308
Ajc-185394

CHANGE OF NAME
I, SHAI K JAFAR (Old Name) R/o.H.No: 5-1-540, Siva Nagar, BADVEL-516227, Gopavaram (M), YSR dist., AP., have changed my name as SHAI K JAFAR VALI (New Name)
AJL-180143

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్రః 7382114647
AJA- 176954

WANTED
కడప మునిరావు వీధిలోని ఆపిల్ డిజిటల్స్ నందు పార్ట్‌టైమ్ పనిచేయుటకు అనుభవం కల్గిన కంప్యూటర్ ఆపరేటర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం.Cell:94413 23760
Ajc-176329

BUSINESS OFFER
★ Sri Avani Eco-life Pvt. Ltd. తక్కువ పెట్టుబడితో వ్యాపారాన్ని ప్రారంభించండి. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా బయో డిగ్రేడబుల్ కవర్లను మార్కెటింగ్ చేయుటకు మండలాల వారిగా డీలర్లు కావలెను. Ph:9493786468 / 6301041696. AJH-13344

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

'బాబుతోనే భవిష్యత్తు'



మేనిఫెస్టోను పంపిణీ చేస్తున్న వెంకటేశ్వరరాజు.

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 3: బాబుతోనే రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారంటీ అని మండల మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వరరాజు తెలిపారు. శనివారం మండలంలోని చెన్నరాజుపోడు గ్రామ పంచాయతీ తడికలబైలులో భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ మేనిఫెస్టోను గ్రామంలో ఇంటింటికి పంపిణీ చేశారు. మహిళలకు, యువతకు మేనిఫెస్టోలో ప్రథమ స్థానం కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీలో రెండో స్థానంలో రైల్వేకోడూరు విద్యార్థులు



బాలికలను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 3: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో జిల్లా స్థాయి బాలికల విభాగం లో రైల్వేకోడూరు ఎస్వీ జూనియర్ కాలేజి విద్యార్థినులు రెండో స్థానం సాధించినట్లు రైల్వేకోడూరు ఎస్వీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎన్ శ్రీనివాసులు, డైరెక్టర్ వసుంధర తెలిపారు. శనివారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల 31 నుంచి ఈ నెల 2 వరకు అన్నమయ్య జిల్లాలో కబడ్డీ పోటీలు నిర్వహించా రన్నారు. తమ విద్యార్థినులు విశేష ప్రతిభ చాటడడంతో రెండో స్థానం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో పీఈడీ పుల్లారావు, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

రామాపురం ఎంపీడీవోగా ప్రభాకర్



రామాపురం, ఫిబ్రవరి 3: రామాపురం మండల అభివృద్ధి అధికారిగా డీ. ప్రభాకర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లా పామిడి మండలంలో ఎంపీడీవోగా పని చేస్తూ రామాపురం మండలానికి బదిలీ అయినట్లు ఆయన తెలిపారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీవో హైదర్ వలి చక్రాయపేట మండలానికి బదిలీపై వెళ్లారన్నారు.

మన్నూర్ సీఐగా రవీంద్రనాథ్



రాజంపేట, ఫిబ్రవరి 3: మండలంలోని మన్నూర్ పోలీస్‌స్టేషన్ సీఐగా ఎస్.రవీంద్రనాథ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా ఈయన సత్యసాయి జిల్లా నుంచి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్ఐ భక్తవత్సలం రాయచోటికి వెళ్లారు. మన్నూర్ పోలీస్‌స్టేషన్ అప్‌గ్రేడ్ అవడంతో సిఐ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ఉంటారని పోలీస్ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని కలు పకడ్బందీగా నిర్వహిస్తామని, అసాంఘిక కార్యకలాపాల కట్టడికి కృషి చేస్తానన్నారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వం కోసం దరఖాస్తు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 3: కాంగ్రెస్ పార్టీ రైల్వేకోడూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా తన పేరును పరిశీలించాలని కాంగ్రెస్ పార్టీ అధిష్టానికి శనివారం కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి రాజబోయిన శ్రీకాంత్ విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం ఆంధ్ర రత్న భవన్‌లో దరఖాస్తును అందించామని తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు పోటీ చేసే వారి దరఖాస్తులు చేసుకోవాలని, వాటిని పరిశీలిస్తామని అధిష్టానం చెప్పడంతో దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చాలా కాలంగా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ప్రభుత్వంపై వత్తిడి చేసి పరిష్కారం చేసేందుకు కృషి చేశామని తెలిపారు.

దూదేకుల సంఘంపై ఆరోపణలు అవాస్తవం

రైల్వేకోడూరు, (రూరల్) ఫిబ్రవరి 3: నూర్‌బాషా దూదేకుల సంఘంపై ఆరోపణలు అవాస్తవం అని రైల్వేకోడూరు నూర్‌బాషా దూదేకుల సంఘం అధ్యక్షుడు బోధనపు మహబూబ్‌బాషా తెలిపారు. శనివారం రైల్వేకోడూరు సంఘ కార్యాలయ ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూర్ బాషా సంఘానికి సంబంధం లేని వ్యక్తులు తప్పుగా ప్రచారం చేస్తున్నారన్నారు.సంఘం ఎప్పుడూ తప్పుడు పనులు చేయదని తెలిపారు. తమ సంఘం కేవలం తమ హక్కుల కోసం పాటు పడుతుందన్నారు. ఏ రాజకీయ పార్టీలకు మద్దతు పలకలేదన్నారు. తప్పుడు ప్రచారం చేసే వ్యక్తులపై ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ సమా వేశంలో నూర్ బాషా సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలో పెట్టుబడుల్లో .. వైసీపీ పాలనలో స్మగ్లింగ్‌లో.. రాష్ట్రం ప్రథమ స్థానం

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 3: టీడీపీ హయాంలో పెట్టుబడుల్లో, జగన్ పాలనలో గంజాయి స్మగ్లింగ్‌లో రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచిందని టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథనాయుడు విమర్శించారు. శనివారం టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో అభివృద్ధి జరగగా, జగన్ పాలనలో కూల్చివేతలు జరిగాయన్నారు. రాష్ట్రంలో దోపిడీలు, అరాచకాలు రాజ్యమేలుతున్నా యన్నారు. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా దాని మూలాలు ఆంధ్రలోనే ఉండడం జగన్ పాలనకు నిదర్శనమన్నారు. గంజాయి స్మగ్లింగ్‌తో యువకుల జీవితాలు నాశనం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గంజాయి స్మగ్లింగ్‌లోకి ఇప్పుడు పోలీసులు కూడా ప్రవేశించారన్నారు. గంజాయి మాఫియాకు ఏపీ సర్కారు పెద్దల అండదండలు ఉన్నాయని ఆరోపించారు. రాజకీయ కక్ష సాధింపుల కోసం జగన్ ఖాకీలను ప్రైవేటు సైన్యంగా ఉపయోగించుకున్నాడని ఆరోపించారు. మండల టీడీపీ అధ్యక్షుడు కొమ్మా శివ, జనసేన పార్టీ ఇన్‌చార్జి బోనాసి వెంకట సుబ్బయ్య, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కమతం నాగరాజుయాదవ్, రాజంపేట పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు పుల్లెల రమేష్‌బాబు, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు తేనేపల్లి చిన్నా, వాణిజ్య విభాగం కార్యదర్శి బుంగటావుల రాజశేఖర్, మాజీ సర్పంచ్ ముక్కర శంకరయ్య, నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నాగినేని సురేష్‌యాదవ్, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు శివకుమార్, బూత్ ఇన్‌చార్జిలు కావేటి శ్రీనివాసులు, కైలసాని శ్రీనివాసులు మైనార్టీ నాయకుడు కరీముల్లా, తదితరులు పాల్గొన్నారు.

తప్పు చేస్తే శిక్ష తప్పదు..

పుల్లంపేట: పుల్లంపేట రెవెన్యూ కార్యాలయంలో మండల టీడీపీ నాయకులతో కలిసి కస్తూరి విశ్వనాథనాయుడు అసైన్మెంట్ కమిటీలో అవకతవకలపై విచారణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పు చేస్తే శిక్ష తప్పదని హెచ్చరించారు. అధికారంలోకి రాగానే తప్పులు చేసిన అధికారులను వదిలిపెట్టే ప్రసక్తి లేదని తెలిపారు. ఓటర్ల జాబితాలో తప్పులను సవరించకుంటే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు.



మీడియా సమావేశం లో మాట్లాడుతున్న కస్తూరి

రాయచోటిటౌన్: తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు కంపెనీలు తీసుకొస్తే జగన్‌మోహన్‌రెడ్డి గంజాయిని తీసుకొచ్చాడని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా ఆరోపించారు. శనివారం ఆయన స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలో పలు రాష్ట్రాల్లో గంజాయి పట్టుబడితే దాని మూలాలు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉండడం జగన్‌రెడ్డి అరాచక పాలనకు నిదర్శనం అన్నారు. గంజాయి స్మగ్లింగ్ డబ్బంతా తాడేపల్లి ఖజానాకు వెళుతోందని ఆయన ఆరోపించారు. రాష్ట్రాన్ని గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ముఖ్యమంత్రిగా జగన్‌రెడ్డి చరిత్రలో పుటల్లో నిలిచిపోతాడన్నారు. వచ్చే ఎన్నికల్లో 165 సీట్లతో టీడీపీ, జనసేన విజయఢంకా మోగించడం తథ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు అమీర్‌జాన్, చిన్నమండెం టీడీపీ సీనియర్ నాయకులు మల్లు, నియోజకవర్గ ప్రచార కార్యదర్శి ఎస్‌యండీ రఫీ, ప్రొఫెషనల్ వింగ్ రాయచోటి సోషల్ మీడియా నాయకులు సయ్యద్, కార్యదర్శి ఫైరోజ్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులకు రక్షణ కల్పించాలి

రైల్వే కోడూరు, ఫిబ్రవరి 3:రెవెన్యూశాఖలో పని చేస్తున్న అధికారులకు, సిబ్బందికి రక్షణ కల్పించాలని రైల్వేకోడూరు డిప్యూటీ తహసీల్దార్ అమరేశ్వరి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. నల్లబ్యాడ్జిలతో విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశాఖపట్నం రూరల్ తహసీల్దార్ రమణయ్య హత్య వెనుక ఎంత పెద్దవారున్నా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డీటీ సిద్దూ, ఆర్ఐ రాజశేఖర్, రీ-సర్వే డీటీ మానస, సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జునరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్‌సాయిరాఘవేంద్రారెడ్డి పాల్గొన్నారు.

పుల్లంపేట: విశాఖ రూరల్ తహసీల్దార్ రమణయ్యను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని పుల్లంపేట తహసీల్దార్ రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహ కుమార్ డిమాండ్ చేశారు శనివారం స్థానిక కార్యాలయం వద్ద రాష్ట్ర నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ అధికారులకు రక్షణ కల్పించాలని కోరారు. పుల్లంపేట రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



రైల్వే కోడూరు:నిరసన వ్యక్తం చేస్తున్న రెవెన్యూ అధికారులు



పుల్లంపేట రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సిబ్బంది

రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 3: రాయచోటి పట్టణాన్ని ప్రమాద రహిత పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రవాణా, పోలీసుశాఖలు పని చేస్తున్నాయని అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ మహబూబ్‌బాషా, మోటారు వాహనాల తనిఖీ అధికారి అనిల్‌కుమార్ అన్నారు. కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వ రవాణాశాఖ ఆదేశాల మేరకు జనవరి 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 19 వరకు జరుగుతున్న 35వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రాయచోటి మోటారు వాహనాల తనిఖీ అధికారి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్ కాలనీ చెక్‌పోస్ట్ శివనంది సర్కిల్ నుంచి ద్విచక్ర వాహనదారులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ వాహనదారుల నిర్లక్ష్యం కారణంగానే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు వాహనాలను నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను పాటిస్తూ ట్రాఫిక్‌లో పాదచారులకు, వాహనదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలన్నారు.



రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు, రవాణా అధికారులు

రైతుల ఈకేవైసీ త్వరగా పూర్తి చేయాలి

● జేడీఏ చంద్రానాయక్

సుండుపల్లె, ఫిబ్రవరి 3: ఈ క్రాప్ బుకింగ్ చేసిన ప్రతి రైతు దగ్గర ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలని అన్నమయ్య జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ చంద్రానాయక్ ఆదేశించారు. శనివారం మండలంలోని తిమ్మసముద్రం, సుండుపల్లె రైతు భరోసా కేంద్రం పరిధిలోని వేరుశనగ పైరు, మామిడి తోటలను ఆయన పరిశీలించారు. ఈక్రాప్ బుకింగ్ చేసిన పొలాలను పరిశీలించి రైతుల వద్ద ఈకేవైసీ చేయించారు. మండల వ్యాప్తంగా 800 మంది రైతులు ఈ క్రాప్ బుకింగ్ చేసుకోగా, వారిలో 490 మంది రైతుల ఈకేవైసీ పూర్తి అయ్యిందన్నారు. మిగిలిన రైతుల ఈకేవైసీ వీలైనంత త్వరగా పూర్తి చేయాలని రైతు భరోసా కేంద్ర సహాయకులకు సూచించారు. అలాగే పీఎం కిసాన్‌కు సంబంధించి ఈకేవైసీ పెండింగ్ లో ఉన్న రికార్డులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు వ్యవసాయశాఖ సిబ్బంది సూచనలు, సలహాలను రైతులకు అందించాలని కోరారు. ప్రతి రైతు వ్యవసాయ సిబ్బంది సూచనలు తప్పక పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి మహబూబ్‌బాషా, వ్యవసాయ సహాయకులు వెంకటమోహన్, రాచయ్య, మల్లికార్జున, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



వేరుశనగ పైరును పరిశీలిస్తున్న జేడీఏ చంద్రానాయక్

అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయాలి

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 3: అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయాలని ఆపస్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు తెలిపారు. శనివారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో అప్రెంటిస్ విధానాన్ని పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకోవడాన్ని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి మనోహర్, శ్రీనివాసులు, జిల్లా సేవా ప్రముఖులు మల్లయ్య, మండల ఉపాధ్యక్షుడు సాయిచరణ్‌యాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహులు

బ్యాంక్ మేనేజరుకు సన్మానం

లక్కిరెడ్డిపల్లె ఫిబ్రవరి 3: ఆంధ్రప్రగతి బ్యాంక్ మేనేరు వెంకటేసు సేవలు అభినందనీయమని మానవత రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాదుయాదవ్ కొనియాడారు. లక్కిరెడ్డిపల్లె ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో మేనేరుగా పని చేస్తూ నెల్లూరు బ్రాంచ్‌కు చీఫ్ మేనేజరుగా వెళుతున్న వెంకటేసును మానవత సభ్యులు, ఖాతాదారులు శనివారం స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్యాషియర్ దేవానంద్, ఫీల్డ్ ఆఫీసర్ చంద్రమౌళి, విశ్వభారతి హైస్కూల్ కరస్పాండెంట్ రఘునాథరాజు, గంగరాజు, రవి, ఏలియా, సాయిరెడ్డి, మల్లికార్జుననాయుడు, వీరమ్మ, సుధ, దర్బార్, చైతన్యరెడ్డి, రామాంజనేయులు తదితరలు పాల్గొన్నారు

మామిడిలో సస్యరక్షణపై శిక్షణ



సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన శాఖ అధికారిణి నాగమణి

గాలివీడు, ఫిబ్రవరి 3: మామిడి పూత, పిందె దశలో రైతులు చేపట్టాల్సిన చర్యలపై శిక్షణ ఇచ్చినట్లు ఉద్యాన శాఖ అధికారిణి టీ. నాగవేణి తెలిపారు. శనివారం మండలంలోని నూలివీడు, సీసీపల్లెల్లో సస్యరక్షణ చర్యలపై మామిడి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెల్లపూత దశలో ఎలాంటి రసాయన మందులు పిచికారీ చేయకూడదన్నారు. పిందె బఠాణి గింజంత సైజులో ఉన్నప్పుడు ఆశించే తేనెమంచు పురుగు, బూడిద తెగులు, పక్షి కన్ను తెగులు, పిందె రాలడం నివారణకు బుప్రోఫెజిన్, ఎసిఫెట్ 1 గ్రాము లీటరు నీటికి, సాప్ 2 గ్రాములు 1 లీటరునీటికి, ప్లానోఫిక్స్ 0.25 మి.లీ నీటికి పిచికారా చేయాలన్నారు. గ్రామ సర్పంచ్‌లు, రైతు భరోసా కేంద్ర సహాయకులు రాణాప్రతాప్, మారుతి, రైతులు పాల్గొన్నారు.



బిల్లుల కోసం పడిగాపులు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 3: పంచాయతీరాజ్ శాఖలో గడప, గడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమంలో నిర్వహించిన పనులకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో కాంట్రాక్టర్లు ఇబ్బందులకు గురవుతున్నారు. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాల్లో గడప, గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పలువురు సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పనులు చేశారు. సుమారు పది రోజుల క్రితం పంచాయతీరాజ్ శాఖ డీఈ ఆస్పత్రి పాలు కావడంతో బిల్లులు ఆగిపోయాయి. డివిజన్‌లో ఉన్న ఒక అధికారికి రైల్వేకోడూరు డీఈ బాధ్యతలు ఇచ్చారు. అయినా బిల్లులు కావడం లేదని కాంట్రాక్టర్లు, సర్పంచులు తదితరులు లబోదిబోమంటున్నారు. బిల్లు కావాలంటే డీఈ సంతకాలు ఉండాల్సి ఉంది. ఆయన లేకపోవడం, ఇన్‌చార్జ్ తీసుకున్న అధికారి సంతకాలు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పనులు చేసిన వారు గగ్గోలు పెడుతున్నారు. దీంతో ఒక సర్పంచ్ నాలుగు ఎకరాల భూమిని అమ్ముకుని అప్పులు తీర్చినట్లు ప్రచారంలో ఉంది. ఇలా చాలా మంది వడ్డీలకు డబ్బులు తెచ్చి పనులు చేసి బిల్లు కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా బిల్లు ఇవ్వాలని వారు కోరుతున్నారు. పది రోజుల క్రితం రైల్వేకోడూరు పంచాయతీరాజ్ శాఖ డీఈ అనారోగ్యంపాలు కావడంతో రూ.కోటి విలువైన బిల్లులు రావాల్సి ఉందని రైల్వేకోడూరు పంచాయతీరాజ్ శాఖ ఏఈఈ ఎస్‌బాషా వివరించారు.

విద్యార్థినులకు క్రీడా దుస్తులు అందజేత

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 3: పట్టణానికి చెందిన మడితాటి సుధాకర్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన సోదరుడు మడితాటి శ్రీనివాసులరెడ్డి (కోడీశీను) శనివారం పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు 25 జతల క్రీడా దుస్తులను అందజేశారు. ఈ హెచ్ఎం సైరాబాను, కౌన్సిలర్ ఫయాజ్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు, పీడీలు లలితమ్మ, గోపాల్, నరసరాజు, కోచ్‌లు షఫీ, రవీంద్ర పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ



సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

రాజంపేట, ఫిబ్రవరి 3: ఎన్నికల ముందు మెగా డీఎస్సీ నిర్వహిస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి రావడంతోపాటు ఐదేళ్ల వృథాగా కాలక్షేపం చేసిన జగన్‌రెడ్డి ఎన్నికలు సమీపిస్తుండడంతో డీఎస్సీ నోటిఫికేషన్ అంటూ నిరుద్యోగులను దగా చేస్తున్నారని మండల పార్టీ అధ్యక్షులు గన్నే సుబ్బనరసయ్య నాయుడు, మాజీ అధ్యక్షుడు కోవూరు సుబ్రహ్మణ్యం ఆరోపించారు. శనివారం పార్లమెంట్ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. డీఎస్సీ పేరుతో జగన్‌రెడ్డి కొత్త డ్రామాకు తెరలేపారని విమర్శించారు. జగన్ ట్రాప్‌లో యువత పడవద్దని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సతీష్‌రాజు, కోటయ్య నాయుడు, యువ నాయకులు పరుశురాం నాయుడు, నాగేంద్ర, తులసి, కొమ్మివారిపల్లె శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి బాధితులకు దుస్తుల పంపిణీ..

రాజంపేట, ఫిబ్రవరి 3: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం టీడీపీ నాయకులు కుష్టు వ్యాధిగ్రస్తులకు భోజనం ఏర్పాటు చేసి దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్య నాయుడు, మండల మాజీ అధ్యక్షుడు కోవూరు సుబ్రహ్మణ్యం నాయుడు, సీనియర్ నాయకులు సతీష్‌రాజు, కోటయ్య నాయుడు, యువ నాయకులు పరుశురాం నాయుడు, నాగేంద్ర, తులసి, కొమ్మివారిపల్లె శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సుగవాసిని కలిసిన రైల్వేకోడూరు టీడీపీ నేతలు



సుగవాసి బాలసుబ్రమణ్యంను సన్మానిస్తున్న రైల్వేకోడూరు టీడీపీ నేతలు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 3: రాజంపేట పార్లమెంట్ టీడీపీ నేత సుగవాసి బాలసుబ్రమణ్యంను శనివారం రైల్వేకోడూరు నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు నందవరం అజయ్ బాబు, సునంద, ఎస్వీ రమణ, గీతాంజలి కళాశాల కరస్పాండెంట్ రమణ నాయుడు, సునీల్ తదితరులు రాయచోటి పట్టణంలోని ఆయన నివాసంలో కలిసి శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలి యజేశారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ స్థితిగతులపై చర్చించి రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి తమ సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు.

వంక స్థలాల్లో ఆక్రమణలు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 3: వంక స్థలంలో అక్రమ కట్టడాలు అన్న శీర్షికతో ఈ నెల 1న ఆంధ్రజ్యోతిలో ఈ నెల 1న ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. రాఘవరాజపురం పంచాయతీలోని గంగరాజపురం ప్రధానదారి పక్కనే కోట్లు విలువ చేసే వంకపరంబోకు స్థలంలో అక్రమ కట్టడాలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. వంక పోరంబోకు స్థలాలను ఎవరూ ఆక్రమించరాదని డిప్యూటీ తహసీల్దార్ అమరేశ్వరి శనివారం తెలిపారు. వంకపోరంబోకు స్థలాలలో ఎవరైనా కట్టడాలు చేసినా, ఆక్రమించినా చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు.

'ఇసుక రవాణాలో వైసీపీ నాయకుల హస్తం'

ఒంటిమిట్ట, ఫిబ్రవరి 3: ఇసుక రవాణాలో వైసీపీ నాయకుల కోట్లు సంపాదించారని రాష్ట్ర బీజేపీ నాయకుడు రమేష్ నాయుడు విమర్శించారు. శనివారం ఒంటిమిట్టలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నాయకులు, మైనింగ్, మట్టి మాఫియా, భూ కబ్జాలు సెటిల్మెంట్ ద్వారా కొన్ని వేల కోట్ల సంపదను దోచేశారని ఆరోపించారు. అడ్డు వచ్చిన వారిపై అక్రమ కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురి చేశారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వైసీపీ అక్రమాలను గమనిస్తుందని సరైన సమయంలో చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అక్రమ డబ్బుతో వైసీపీ నాయకులు ఎన్నికలకు సిద్ధం అవుతున్నారని ప్రజలు గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

మన్నూర్ హైస్కూల్‌కు మైక్ వితరణ

రాజంపేట, ఫిబ్రవరి 3: మండలంలోని మన్నూర్ హైస్కూల్‌కు మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు షేక్ అబ్దుల్లా, విజన్స్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పోతుగుంట రమేష్ నాయుడు శనివారం పాఠశాలకు మైక్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పరిమళ, ఉపాధ్యాయుడు వేణుగోపాల్ నాయుడు పాల్గొన్నారు.

'ఎన్నికలకు సిద్ధం కండి'



సమావేశంలో మాట్లాడుతున్న సాయి లోకేష్

చిట్వేలి, ఫిబ్రవరి 3: కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయి లోకేష్ పిలుపునిచ్చారు, శనివారం పట్టణంలోని కార్యాలయంలో పల్లెకు పోదాం కార్యక్రమంపై నాయకులకు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర పథకాలపై రాష్ట్ర ప్రభుత్వం తమ ముద్ర వేసుకుంటోందని ఆరోపించారు. కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఒక్కరికి వివరించాలని సూచించారు. రాష్ట్ర నాయకుడు పనతల సురేష్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గడ్డం చెంగల్‌రాజు, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు వర్మ, సీనియర్ నాయకులు తోట శ్రీనివాసులు సీనియర్ నాయకులు తొంబరపు సుబ్బారాయుడు, గాదెల శ్రీనివాసులు, మండల కన్వీనర్ బాపూజీ, జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి నిర్మల, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల బాలికలకు నాణ్యమైన ఆహారం అందించాలి



కూరగాయలు పరిశీలిస్తున్న జడ్జి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 3: ప్రభుత్వ గిరిజన బాలికల పాఠశాల విద్యార్థినులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని జిల్లా ఐదవ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం ఆయన రాయచోటిలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతులపై ఆరాతీశారు. కూరగాయలు, సరుకులు, తాగునీటిని పరిశీలించారు. మధ్యాహ్న భోజనం రుచి చూశారు. హాస్టల్‌లో నీటి ఎద్దడిని విద్యార్థినులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు స్పందించిన జడ్జి సమస్యను ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. మెనూ పాటించాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. మౌలిక వసతులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బాలికల ఆరోగ్యంపై ఆరాతీసి డాక్టర్లు సక్రమంగా వస్తున్నారా, మందులు అందిస్తున్నారా అని విచారించారు.

ఆడ్వాణీకి భారతరత్నపై హర్షం

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 3: మాజీ ఉప ప్రధానమంత్రి ఆడ్వాణీకి భారత రత్న ప్రకటించడంపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ శనివారం రైల్వేకోడూరు అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పనతల సురేష్, రైల్వేకోడూరు కన్వీనర్ గడ్డం చంగల్రాజు, జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడు దాసరాజు జయప్రకాష్ నారాయణవర్మ, నాయకులు గాదెల శ్రీనివాసులు, ఆయపాటి గౌరీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాండవ్యనదిని పరిరక్షించండి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 3: కబ్జాదారుల బారినుంచి మాండవ్యనదిని పరిరక్షించాలని సీపీఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి పీ. శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పట్టణంలోని మాండవ్యనదికి ఇరువైపులా స్థలాలను చదును చేసి కబ్జా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష్మీపురం, రాయచోటి- కదిరి ప్రధాన రహదారిలో నదిపై వంతె నకు ఇరువైపులా, చెన్నముక్కపల్లె వద్ద నదిని ఆక్రమించి అక్రమ కట్టడాలు నిర్మించుకు న్నారని వాపోయారు. బిజిలీ గుట్టపై ఆక్రమణదారులపై కేసులు నమోదు చేయకపోవడం నిదర్శనమన్నారు. మాండవ్యనదితో పాటు ప్రభుత్వ భూములను కాపాడని పక్షంలోప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్

చిన్నమండెం, ఫిబ్రవరి 3: మండలంలోని ఆదర్శ పాఠశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శనివారం బెస్తపల్లిలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. రక్తదానం పౌష్టికాహారం ఆవశ్యకత ను గ్రామీణులకు వివరించారు. చిన్నమండెం పీహెచ్‌సీ సిబ్బంది రక్తపరీక్షలు నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, గ్రామ పెద్దలు, ఉపాధ్యా యులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

రాయచోటిటౌన్: పట్టణ పరిధిలోని సుద్దలవాండ్లపల్లెలో రాయచోటి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్థానికులకు ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, పౌష్టికాహారం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయో లేదో తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ శంకరయ్య, అధ్యాపకులు సలీం, అశోక్, ఆఫీఫా, తనూజ పాల్గొన్నారు.

తాగునీటి స్కీం బోరు ప్రారంభం

గాలివీడు, ఫిబ్రవరి 3: మండలంలోని గోరాన్‌చెరువు గ్రామ పంచాయతీ దాసరివాండ్లపల్లెలో శనివారం సర్పంచ్ దీప్తి ఆధ్వర్యంలో తాగునీటి స్కీమ్ బోరు, కొళాయిలు ప్రారంభించారు. చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి వీధిలో కొళాయి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

బరుగూరు సమీపంలో ఆర్టీసీ బస్సు బోల్తా

డ్రైవర్, ప్రయాణికులకు స్వల్ప గాయాలు



బరుగూరు సరిహద్దులో బోల్తాపడిన బస్సు

కుప్పం, ఫిబ్రవరి 3: కుప్పం నుంచి తమిళనాడు రాష్ట్రం బరుగూరుకు వెళుతున్న ఆర్టీసీ బస్సు శనివారం ప్రమాదవశాత్తూ బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కుప్పం నుంచి సుమారు 20 మంది ప్రయాణికులతో బరుగూరుకు ఆర్టీసీ బస్సు బయల్దేరింది. తెల్లవారుజామున 5.30 గంటలకు పొగమంచు కమ్మేయడంతో కనుమూరు దాటాక మలుపులో అదుపుతప్పి రోడ్డు పక్కకు బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్ సెల్వరాజ్, కొంతమంది ప్రయాణికులు గాయపడ్డారు. స్థానికులు గమనించి బాధితులను బయటకు తీసి, ఆస్పత్రికి తరలించారు. తమిళనాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలం చెల్లిన బస్సులతో ప్రమాదాలు : టీడీపీ

'టీడీపీ హయాంలో చంద్రబాబు.. కుప్పం డిపోకు తీసుకొచ్చిన కొత్త బస్సులను ఇటీవల పుంగనూరుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తరలించారు. దీనివల్ల డొక్కు బస్సులను ఇక్కడ నడుపుతుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి' అని టీడీపీ నేత కనకరాజ్ ఆరోపించారు. దీనికి నిదర్శనమే ఈ ప్రమాదమని చెప్పుకొచ్చారు. కాలం చెల్లిన బస్సులతో ప్రయాణికులతో చెలగాటం ఆడటం మాని.. ఇప్పటికైనా కుప్పం డిపోకు కొత్త బస్సులు వేయాలని ఆయన డిమాండు చేశారు.

రేపటి నుంచి ఇంటర్ ప్రయోగ పరీక్షలు



ఆర్ఐవో ప్రభాకర్‌రెడ్డి

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 3 : ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు ఈనెల 5నుంచి 20వ తేదీ వరకు జరగనున్నాయి. నాన్ జంబ్లింగ్ విధానంలో జరిగే ఈ పరీక్షలకు జిల్లాలో జనరల్ విభాగంలో(సీనియర్ ఇంటర్) 22,454మంది, ఒకేషనల్ విభాగంలో(ప్రథమ, ద్వితీయ) 2,353మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి వెల్లడించారు. ఉదయం 9-12, మధ్యాహ్నం 2-5గంటల వరకు రెండు సెషన్లలో నిర్వహించే ఈ పరీక్షలకు జనరల్‌లో 120, ఒకేషనల్‌లో 22 కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈనెల 5నుంచి 20వ తేదీ వరకు ఒక్కో స్పెల్‌లో ఐదు రోజుల చొప్పున మూడు స్పెల్స్‌లో ఒకేషనల్ పరీక్షలు, ఇదేనెల 11నుంచి 20వ తేదీ వరకు రెండు స్పెల్స్‌లో జనరల్ కోర్సులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

రాష్ట్రాన్ని గంజాయి వనంగా మార్చేశారు : టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న నరసింహయాదవ్

తిరుపతి(తిలక్ రోడ్), ఫిబ్రవరి 3: వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని గంజాయి వనంగా మార్చేశారని టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్ విమర్శించారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో వనరులు అన్ని దోపిడీకి గురయ్యాయని తెలిపారు. అరాచకం రాజ్యమేలుతోందని దుయ్యబట్టారు. టీడీపీ రాష్ట్రానికి కంపెనీలు, పెట్టుబడులు తీసుకువస్తే జగన్ గంజాయి తెచ్చాడని విమర్శించారు. తిరుపతిలో యువత విచ్చలవిడిగా గంజాయి తాగుతున్నారని, ఎమ్మెల్యే గంజాయిపై నగరం మొత్తం కలియదిరిగి ఏమి సాధించారో చెప్పాలని ప్రశ్నించారు. ఇటీవల తిరుపతిలో హత్యలన్నీ గంజాయి మత్తులో జరిగినవేనని ఆరోపించారు. గంజాయి స్మగ్లింగ్‌లో పోలీసులు కూడా భాగస్వామ్యం కావడం సిగ్గుచేటన్నారు. 22 కిలోల గంజాయితో కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్, మరో కానిస్టేబుల్ పట్టుబడడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వూకా విజయకుమార్, శ్రీధర్‌వర్మ, యశ్వంత్‌రెడ్డి, జగన్నాథం, రాజయ్య, మనోహర్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

పింఛను సొమ్ముతో ఉడాయించిన వలంటీరు!

గ్రామస్తుల నిరసనతో డబ్బిచ్చిన కుటుంబీకులు




శనివారం పింఛనుదారులకు నగదు పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

గుడుపల్లె, ఫిబ్రవరి 3: పింఛను సొమ్ముతో ఓ వలంటీరు ఉడాయించాడని అధికారుల దృష్టికి పింఛనుదారులు తీసుకెళ్లారు. ఆపై నిరసనకు దిగారు. దాంతో నిందితుడి కుటుంబీకులు ఆ డబ్బులు తీసుకొచ్చి ఇచ్చారు. అయితే వలంటీరుకు ఆరోగ్యం సరిగా లేక పంపిణీ ఆలస్యమైందని ఎంపీడీవో చెబుతున్నారు. ఈ సంఘటన గుడుపల్లె మండలంలోని శెట్టిపల్లె పంచాయతీ కప్పలనత్తం గ్రామంలో జరిగింది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కప్పలనత్తం గ్రామంలో వలంటీరు హరీష్.. 38 మంది పింఛనుదారులకు సంబంధించిన రూ.1,05,000ను జనవరి 31వ తేదీన సచివాలయ కార్యదర్శి దగ్గర తీసుకున్నాడు. ఫిబ్రవరి ఒకటో తేదీ ఉదయం నుంచే ఈ సొమ్మును పింఛనుదారులకు పంపిణీ చేయాలి. ఉదయం 10 గంటలు దాటినా సొమ్ము అందక పోవడంతో పింఛనుదారులంతా వలంటీరు ఇంటికి వెళ్లారు. పింఛను ఎందుకు ఇవ్వలేదని వలంటీరును అడిగితే అధికారులు డబ్బులివ్వలేదని, సాయంత్రం ఇచ్చాక అందజేస్తానని చెప్పాడు. ఫిబ్రవరి రెండో తేదీ మధ్యాహ్నం అవుతున్నా పింఛను సొమ్ము అందక పోవడంతో పింఛనుదారులు సచివాలయానికి వెళ్లి సర్పంచ్ రీటా ఎల్లప్పకు ఫిర్యాదు చేశారు. సర్పంచ్ వెంటనే ఎంపీడీవో తాజ్ మస్రూర్‌కు తెలిపారు. ఎంపీడీవో.. శెట్టిపల్లె సచివాలయానికి రాగా, వలంటీరుపై పింఛనుదారులు ఫిర్యాదు చేశారు. సాయంత్రంలోపు పింఛను సొమ్ము అందజేయాలని సచివాలయ సిబ్బందికి చెప్పి ఎంపీడీవో వెళ్లిపోయారు. అయినా సొమ్ము పంపిణీ జరగక పోవడంతో శనివారం ఉదయం పింఛనుదారులంతా వలంటీరు ఇంటికి వెళ్లగా అతడి జాడ లేదు. సెల్‌ఫోన్ కూడా పనిచేయలేదు. కుటుంబ సభ్యులను అడిగితే వారు తమకు తెలియదన్నారు. దాంతో తమ డబ్బుతో వలంటీరు ఉడాయించాడని నిర్ధారణకు వచ్చి, రోడ్డుపై నిరసనకు దిగారు. విషయం తెలుసుకున్న వలంటీరు కుటుంబీకులు ఆ డబ్బును తీసుకొచ్చి సచివాలయ సిబ్బందికి అందజేశారు. వారు పింఛనుదారులకు పంపిణీ చేశారు. ఈ విషయమై ఎంపీడీవో తాజ్ మస్రూర్‌కు వివరణ కోరగా.. వలంటీరుకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో పెన్షన్ పంపిణీ ఆలస్యం అయ్యిందని తెలిపారు.

యానాది కాలనీలో ఇసుకదందా

అడ్డుకున్న గ్రామస్థులు





ఇసుక తవ్వకాలు జరుపుతున్న కూలీలు - గ్రామస్తులు అడ్డుకున్న ట్రాక్టర్లు

రామకుప్పం, ఫిబ్రవరి 3: రామకుప్పం మండలం బందార్లపల్లె పంచాయతీ ముద్దనపల్లె బీట్ గడ్డూరు యానాదికాలనీ అటవీప్రాంతంలో అధికారపార్టీ ప్రజాప్రతినిధి ఇసుక దందాను యానాదికాలనీ, గోవిందరాజపురం, వినాయకపురం గ్రామస్థులు శనివారం రాత్రి అడ్డుకున్నారు. వారి కథనం మేరకు ... మూడు నెలలుగా అధికారపార్టీకి చెందిన ఓ నేత, ఓ ఎంపీటీసీ ఇక్కడి అటవీ లోతట్టు ప్రాంతంలోని బండిమోడుచెరువువంకలో ఇసుకను తవ్వి తమిళనాడుకు తరలిస్తున్నారు. ఇసుక రవాణా కోసం ఏనుగుల దాడుల నిరోధం కోసం ఏర్పాటు చేసిన కందకాలను పూడ్చివేసి, అడవిలో కిలోమీటర్ల మేర రోడ్డును ఏర్పాటు చేసుకున్నారు. రెండు నెలలపాటు పొక్లైనర్‌తో ఇసుక తవ్వకాలు జరిపి, యధేచ్ఛగా రవాణా చేశారు. ఇసుక తరలింపుపై పలుమార్లు గ్రామస్తులు ప్రశ్నిస్తే, తమకు ప్రభుత్వ అనుమతులున్నాయని చెబుతూ వచ్చారు. గ్రామస్తులు ప్రశ్నించడంతో పొక్లైనర్ వాడకాన్ని విడిచిపెట్టి, రాత్రి వేళల్లో కూలీలచే ట్రాక్టర్లలో ఇసుక రవాణాను కొనసాగిస్తున్నారు. వారం రోజుల క్రితం నాలుగు గ్రామాల ప్రజలు అనుమానంతో అనుమతుల పత్రాలు చూపాలని ఇసుక అక్రమ రవాణాదారులను గట్టిగా నిలదీశారు. దీనిపై వారు గ్రామస్తులపై దురుసుగా ప్రవర్తించారు. దీంతో గ్రామస్తులు రెండు ఇసుక ట్రాక్టర్లను అడ్డుకుని, అటవీ అధికారులకు అప్పగించారు. కానీ దానిపై అటవీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకున్నారో తెలియడం లేదు. అటవీ అధికారులు కఠిన చర్యలు తీసుకుని ఉంటే ఇసుకదందాకు తెరపడేదని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. వారు అక్రమ రవాణాదారులతో లాలూచీ పడటం వల్లే ఇసుకదందా నిరాటంకంగా సాగుతోందని వారు ధ్వజమెత్తుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి నాలుగు గ్రామాల ప్రజలు ఇసుక తవ్వకాలు జరుగుతున్న అటవీ ప్రాంతం చేరుకున్నారు. అక్కడి నుంచి ఇసుకతో వస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను వారు అడ్డుకున్నారు. వాటిలో ఇసుక ట్రాక్టరును డ్రైవర్ వెనక్కు మళ్ళించి తీసుకెళ్ళిపోయాడు. ట్రాక్టర్లను గ్రామస్తులు అడ్డుకున్నారన్న విషయం తెలుసుకున్న ఇసుక దందాకు పాల్పడుతున్న ప్రజాప్రతినిధి గ్రామస్థులను ఫోన్‌లో బెదిరించారు. అయినా వారు ట్రాక్టర్లను అక్కడి నుంచి కదలనీయలేదు. విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్న అటవీ సిబ్బందిపై వారు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇసుక అక్రమరవాణాదార్లతో కుమ్మక్కై, వారికి పూర్తిగా సహకరిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తీవ్ర వాగ్వాదాల అనంతరం ఉన్నతాధికార్ల దృష్టికి తీసుకెళ్ళి, ఇసుక అక్రమరవాణాదార్లపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని అటవీసిబ్బంది హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. గ్రామస్తులు అడ్డుకున్న ట్రాక్టర్లను అటవీ సిబ్బంది ననియాల ఎలిఫెంట్ క్యాంపుకు తరలించారు.

చిత్తూరులో నేడు కె.సభా శతజయంతి సదస్సు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 3 :ప్రఖ్యాత రచయిత కె.సభా శతజయంతి సదస్సును ఆదివారం చిత్తూరు బైపాస్ రోడ్డులో గల కట్టమంచి బాలకృష్ణారెడ్డి మ్యాంగో భవనంలో కేంద్ర సాహిత్య అకాడమీ సహకారంతో నిర్వహించనున్నట్లు చిత్తూరు జిల్లా రచయితల సంఘం ఓ ప్రకటనలో తెలిపింది. రచయిత్రి కె.రామలక్ష్మి అధ్యక్షతన జరిగే ప్రారంభ సమావేశంలో సి.మృణాళిని స్వాగతోపన్యాసం చేస్తారు. కె. బాలకృష్ణారెడ్డి గౌరవ అతిథిగా పాల్గొనే ఈ సమావేశంలో రచయిత మధురాంతకం నరేంద్ర కీలకోపన్యాసం చేస్తారు. అనంతరం ఎస్వీయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కిరణ్ క్రాంత్ చౌదరి అధ్యక్షతన జరిగే మొదటి సమావేశంలో కె.సభా కథాసాహిత్యంపై డి.రాజేశ్వరమ్మ, జీవితం-సాహిత్యంపై పాయసం సుబ్రమణ్యం, బాల సాహిత్యంపై పత్తిపాక మోహన్ పత్ర సమర్పణ చేస్తారు. మధ్యాహ్నం కాసిమ్ అలీ ఖాన్ అధ్యక్షతన జరిగే రెండవ సమావేశంలో కె.సభా నవలలపై జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, కవిత్వ రచనలపై పలమనేరు బాలాజీ, నాటికలపై ఎంఆర్ అరుణకుమారి పత్ర సమర్పణ చేస్తారు. సాయంత్రం జరిగే ముగింపు సమావేశానికి డి.అశోక్‌కుమార్ గౌరవ అతిథి కాగా వసపల హరికృష్ణారెడ్డి అధ్యక్షత వహిస్తారు. కె.వేణుగోపాల్ సమాపన ప్రసంగం వుంటుంది.కవులు, రచయితలు, కళాకారులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.11 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.11 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 58,842 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 21,796 మంది తలనీలాలు సమర్పించారు. కాగా కేంద్రమంత్రి ఎల్.మురుగన్, ఎమ్మెల్యే రాంగోపాల్‌రెడ్డి, సినీనటుడు శివారెడ్డి శనివారం శ్రీవారిని దర్శించుకున్నారు.

ఎన్నికల విధుల కోసం ఉద్యోగుల వివరాలివ్వండి

కలెక్టర్ షన్మోహన్ ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 3: ఎన్నికల విధుల కోసం కమిషన్ ఆదేశాల మేరకు ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగస్తులందరి పూర్తి వివరాలను ఈనెల 7వ తేదిలోగా కలెక్టరేట్‌కు అందించాలని కలెక్టర్ షన్మోహన్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్‌తో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్షించారు. ఖజానా కార్యాలయం ద్వారా 34 అంశాలతో కూడిన ప్రొఫార్మాలో కిందిస్థాయి ఉద్యోగి నుంచి హెచ్‌వోడీ వరకు అందరి వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. ఉద్యోగి సొంత జిల్లా, నియోజకవర్గం, మండల వివరాలతోపాటు ఉద్యోగుల సీఎఫ్ఎంఎస్ నెంబరు, పేస్కేల్, బేసిక్ వివరాలను అందించాలని సూచించారు. గత ఎన్నికల్లో విధులు నిర్వహించి ఉంటే అలాంటి వివరాలను కూడా నమోదు చేయాలన్నారు. చివరగా సీఎఫ్ఎంఎస్ ద్వారా జీతాలు పొందని ఉద్యోగుల వివరాలు కూడా అప్‌లోడ్ చేయాలని చెప్పారు.

సమీక్షలు - సమావేశాలు

ఐఎన్‌టీయూసీ ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గం

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 3: ఐఎన్‌టీయూసీ ఉమ్మడి జిల్లా కొత్త కార్యవర్గాన్ని తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల అధ్యక్షుడు రత్నకుమార్ ప్రకటించారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ యూనియన్‌ను బలోపేతం చేసేందుకు, కొత్త సభ్యత్వ నమోదుకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నామని తెలిపారు. మురళీధర్ ప్రధాన కార్యదర్శిగా, రంజిత్‌కుమార్ సంయుక్త కార్యదర్శిగా కొనసాగుతారని ప్రకటించారు.

ఓట్ల కోసమే డీఎస్సీ డ్రామా

● తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ వినూత్న నిరసన



చెవిలో కాలీఫ్లవర్స్‌తో నిరసన తెలుపుతున్న నేతలు - డీఎస్సీ నోటిఫికేషన్, క్యాబినెట్ నిర్ణయ ప్రతుల దగ్ధం



తిరుపతి (రవాణా), ఫిబ్రవరి 3: ఓట్ల కోసమే సీఎం జగన్మోహన్‌రెడ్డి డీఎస్సీ నోటిఫికేషన్ డ్రామా ఆడుతున్నాడని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు విమర్శించారు. శనివారం తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్ద తెలుగు యువత, టీఎస్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కాలీఫ్లవర్ చెవిలో పెట్టుకుని, నుదుటిపై నామాలు దిద్దుకుని వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. రవినాయుడు మాట్లాడుతూ నిరుద్యోగులను మభ్యపెట్టేందుకే సీఎం డీఎస్సీ విడుదల చేశారన్నారు. నెల రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ పెట్టుకుని ఇప్పుడు డీఎస్సీ ప్రకటించడంలో ఆంతర్యమేమిటో అర్థం చేసుకోవాలన్నారు. ఏటా 25వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు. జగన్ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో రాష్ట్రంలో 58వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీని ప్రకటిస్తానని చెప్పి ఐదేళ్ల మోసం ఉత్తుత్తి ప్రకటనలతో మోసం చేశారని తెలిపారు. ఎంతోమంది నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకున్నారని, కొందరు గంజాయి, డ్రగ్స్, మద్యానికి బానిసలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు యువత, టీఎస్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షులు కృష్ణయాదవ్, హేమంత్ రాయల్, రాష్ట్ర అధికార ప్రతినిధి కంకణాల రజనీకాంత్‌నాయుడు మాట్లాడుతూ టీడీపీ హయాంలో మూడు డీఎస్సీల ద్వారా వేలాది టీచరు పోస్టులను భర్తీ చేశారని అన్నారు. మాట తప్పను, మడమ తిప్పను అని చెప్పిన జగన్ ప్రతి మాటను తప్పుతూ యువత, నిరుద్యోగుల భవిష్యత్తును నిర్వీర్యం చేశాడన్నారు. అనంతరం మెగా డీఎస్సీ నోటిఫికేషన్, క్యాబినెట్ నిర్ణయ ప్రతులను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఆర్‌పీ శ్రీనివాసులు, పెరుమాల్ మధుబాబు, తోట వాసు, కరణం సందీప్, టీఎస్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, రఫీ, శ్రీరామ్ బాబి, గోపి, దిలీప్ రాయల్, లోకేష్ రాయల్, జేడీ ప్రసాద్, గాలి పవన్, తిరుమల, యువత అధ్యక్షుడు రాఘవ, సంతోష్, నవీన్, జయకృష్ణ, వంశీ, నాగరాజు, మునిరాజా, రాజేష్, ప్రసాద్, లీలా, హరి తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

ఏర్పేడు, ఫిబ్రవరి 3: మండలంలోని పాతవీరాపురం గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక శుక్రవారం ఉదయం శ్రీకాళహస్తిలోని కళాశాలకు వెళ్లింది. తిరిగి సాయంత్రం ఇంటికి రాలేదు. దీంతో ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ జిలాని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముక్కంటి ఆలయంలో రహస్య విచారణ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 3: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం భద్రత వైఫల్యంపై నిఘా అధికారులు రహస్యంగా విచారణ చేసినట్లు సమాచారం. బాలుడు అర్ధరాత్రి ఆలయ ప్రకారం దాటడంపై ఎస్పీ పరమేశ్వరరెడ్డి స్థానిక పోలీసు అధికారులను ఆరా తీశారు. ఆ తర్వాత మతపరమైన అంశాలపై విచారించే ఇంటెలిజెన్స్ రహస్య బృందం తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి చేరుకుంది. భద్రత లోపాలపై అధ్యయనం చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు సమాచారం.

అన్యమతస్థుల సేవలు అవసరం లేదు

బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి

తిరుమల, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): అన్యమతస్థులను తిరుమలలో శ్రీవారిసేవకు అనుమతించాలంటూ డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో ఓ భక్తుడు కోరిన క్రమంలో టీటీడీ ఈవో పరిశీలిస్తామని చెప్పడాన్ని ఖండిస్తున్నట్లు బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు.ముస్లిం మతంలో శ్రీవారి భక్తులున్నారని, వారికి శ్రీవారిసేవ చేసుకునే అవకాశం కల్పించాలంటూ తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన హుస్సేన్ బాషా శుక్రవారం జరిగిన డయల్ యువర్ ఈవో కార్యక్రమం ద్వారా కోరిన విషయం తెలిసిందే. ఈ అంశాన్ని పరిశీలిస్తామని ఈవో బదులిచ్చిన క్రమంలో బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి శనివారం ఓ వీడియో ద్వారా స్పందించారు. ఆ వ్యాఖ్యలను ఈవో వెనక్కి తీసుకోవాలన్నారు.టీటీడీ ఈవో ఇష్టానుసారం ప్రకటనలు చేస్తే ఎలా సరిపోతుందన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ అన్యమతస్థులను శ్రీవారిసేవకు వినియోగించే వీలు లేదని టీటీడీని హెచ్చరిస్తున్నామన్నారు.టీటీడీ జీతం తీసుకుంటూ కనీసం శనివారంరోజున హారతి, ప్రసాదం తీసుకోకుండా చాలా మంది అన్యమతస్థులు పనిచేస్తున్నారని, వారిని విధుల నుంచి తప్పించి ఇతర ప్రభుత్వ శాఖలకు బదిలీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

తిరుమలలో స్వామీజీల సందడి

ధార్మిక సదస్సుకు హాజరైన పలువురు



సదస్సులో ప్రసంగిస్తున్న టీటీడీ చైర్మన్ కరుణాకర రెడ్డి

తిరుమల, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): తిరుమల ఆస్థానమండపంలో శనివారం ఉదయం శ్రీవేంకటేశ్వర సనాతన ధార్మిక సదస్సు ఘనంగా ప్రారంభమైంది.మూడురోజుల పాటు జరుగనున్న ఈ సదస్సులో పలువురు మఠాధి, పీఠాధిపతులు ధర్మప్రచారం, పరిరక్షణ అంశాలపై అనుగ్రహభాషణంతో పాటు చర్చించనున్నారు. శనివారం 25మంది మఠాధి, పీఠాధిపతులు, ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు అనుగ్రహభాషణం చేశారు.తిరుమల పెద్ద, చిన్నజీయర్ స్వాములు, వ్యాసరాజమఠానికి చెందిన భారతి శక్తిపీఠం మాతృశ్రీ రమ్యానంద, విజయవాడకు చెందిన అష్టాక్షరి సంపత్‌కుమార రామానుజ జీయర్‌స్వామి, భీమవరానికి చెందిన భాష్యకార సిద్ధాంత పీఠం రామచంద్ర రామానుజ జీయర్, శ్రీనివాసమంగాపురానికి చెందిన లలిత పీఠాధిపతి స్వస్వరూపానందగిరి స్వామి, ఏర్పేడు వ్యాసాశ్రమానికి చెందిన పరిపూర్ణానందగిరి స్వామి, కర్ణాటకలోని కుక్కే సుబ్రహ్మణ్య మఠాధిపతి విద్యాప్రసన్న తీర్థస్వామి, కడప బ్రహ్మంగారి మఠాధిపతి విరజానంద స్వామి, గుంటూరుకు చెందిన విశ్వయోగి విశ్వం, తుని తపోవనానికి చెందిన సచ్చిదానంద సరస్వతి, నెల్లూరుకు చెందిన సత్యానంద ఆశ్రమ హరితీర్థ స్వామి, విజయవాడలోని జ్ఞాన సరస్వతి పీఠానికి చెందిన ప్రకాశానంద సరస్వతి స్వామి, తేనెపల్లికి చెందిన చైతన్య తపోవనం మాతా శివనంద సరస్వతి, మాతా సుశ్రుశానంద, ప్రొద్దుటూరుకు చెందిన శివ దర్శనం మాత, ఉత్తరకాశీకి చెందిన స్థిత ప్రజ్ఞానంద సరస్వతి, విజయవాడకు చెందిన చిదానంద ఆశ్రమం సత్యానంద భారతి, గుంటూరుకు చెందిన శైవ క్షేత్రం శివస్వామి, హైదరాబాద్‌కు చెందిన దేవనాథ రామానుజ జీయర్‌స్వామి, విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర స్వామి శనివారం సదస్సులో పాల్గొని అనుగ్రహ భాషణం చేశారు. మఠాధి, పీఠాధిపతుల సలహాలు, సూచనలతో సనాతన హిందూ ధర్మప్రచారాన్ని మరింత గొప్పగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ధార్మిక సదస్సు నిర్వహిస్తున్నట్టు టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డి తెలిపారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ తాను గతంలో చైర్మన్‌గా ఉన్నప్పుడు రెండుసార్లు ధార్మిక సదస్సును నిర్వహించి స్వామిజీల సలహాలతో దళిత గోవిందం, మత్స్య గోవిందం, గిరిజన గోవిందం వంటి కార్యక్రమాల ద్వారా భగవంతుడిని భక్తుల చెంతకు తీసుకెళ్లామన్నారు. సనాతన హిందూ ధర్మప్రచారాన్ని చిత్తశుద్ధితో ప్రజలకు చేరువ చేస్తున్న టీటీడీపై అవాస్తవ విమర్శల దాడి జరుగుతోందన్నారు.తమ వైపు నుంచి ఏవైనా పొరబాట్లుంటే సవరించుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.సదస్సులో పాల్గొని విలువైన పలు సూచనలు, సలహాలు ఇచ్చిన పీఠాధి, మఠాధిపతులు, స్వామిజీలకు టీటీడీ ఈవో ధర్మారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమ ప్రారంభంలో టీటీడీ ధార్మిక కార్యక్రమాలపై ఎస్వీబీసీ రూపొందించిన వీడియోను ప్రదర్శించారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

తిరుపతి - 9160195583, 9703618708
9703618705, 9703618710
9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME
I, (Old Name) MATHUGALLA RANI W/o MATHUGALLA OBULESU changed my name as (New Name) MATHUGALLA NAGAMMA W/o MATHUGALLA OBULESU R/at 30/134, Peddamadiga palli, T Sundupall (M), Annamayya Dist, AP. My Daughter PPNo. P3778575.
AJT - 179861

PLOTS FOR SALE
తిరుపతి శివజ్యోతి నగర్ (భూపాల్ నగర్)లో ప్లాట్ నెం. 28,29 (70 అంకణములు) అమ్మబడును. వివరములకు సంప్ర. : 81793 90957.
AJT - 6064

PLOTS FOR SALE
తిరుపతి, అన్నమయ్య సర్కిల్ నుండి 5 KM దూరంలో చిగురువాడలో లేఅవుట్ లో Ready to Construction, 40 feet CC రోడ్డు కల్గిన ప్లాట్లు అమ్మబడును. 1 Plot Cost 17,40,000 రూ. మాత్రమే. Contact : 9866975111.
AJT - 6065

DIABETES
REVA DIABETES CLINIC Best Diabetes Physician in Tirupati, Dr. Rekha Kattula, MBBS, DFM (RCGP, UK), F.Diab, (MSC Diabetes UK). 18-3-60/C4, Khadi Colony, TPT. Ph: 63018 32678
AJT - 179906

WANTED
తిరుపతి, కొర్లగుంటలోని టైలరింగ్ కంపెనీలో పనిచేయుటకు మరియు ప్యాకింగ్ కోసం మహిళలు కావలెను. ఆసక్తి కలవారు సంప్రదించండి: Cell:92469 91550
AJT:2280

COMMERCIAL PLOTS
తిరుపతి Airport ఎదురుగా ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీస్ ప్రక్కన తక్షణ నిర్మాణమునకు Investment కు అనువైన తుడా ఫైనల్ అప్రూవ్డ్ కమర్షియల్ ప్లాట్స్ అమ్మబడును నేరుగా సంప్ర 80967 83848
AJT - 6058

FLAT FOR SALE
తిరుపతి - కపిలతీర్థం దగ్గరలో అద్భుతమైన Hill View, East Facing గల 2BHK Flat (వెంటనే గృహ ప్రవేశం చేసుకునేల) అమ్మకానికి కలదు. No Brokers Pls 9666821667.
AJT - 10246

BUSINESS OFFER
★ Sri Avani Eco-life Pvt. Ltd. తక్కువ పెట్టుబడితో వ్యాపారాన్ని ప్రారంభించండి. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా బయోడిగ్రేడబుల్ కవర్లను మార్కెటింగ్ చేయుటకు మండలాల వారిగా డీలర్లు కావలెను. Ph:9493786468 / 6301041696. AJH-13344

WANTED
Pre-Primary Teachers (2). Fluency of English is Must. Interested Candidates meet in person: Cell No.: 9666371716. Bhuvaneswari Vidyanikethan. Tiruchanur.
AJT - 6060

FOR SALE
54 X 60 కొలతలు కలిగి ఉత్తర ముఖం గల 3 ఫ్లోర్స్, 6 పోర్షన్లు కలిగిన 70000 వేల రూపాయలు బాడుగల వచ్చు అప్రూవల్ బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ప్రశాంతి నగర్, ఖాదీ కాలనీ, తిరుపతి. Ph:9573066127.
AJT - 1676

FOR SALE
తిరుపతి హౌసింగ్ బోర్డు కాలనీ, నంది సర్కిల్ టు అలిపిరి రోడ్డు, Opp. దివ్యారామం నూతనంగా నిర్మాణంలో లగ్జరీ 1730 చ.అ. 3BHK BJ అపార్ట్‌మెంట్ నందు ఫ్లాట్స్ అమ్మకమునకు కలవు. ప్రావర్టీ ఇన్వెస్ట్‌మెంట్ పర్సన్ వారికి మంచి కమర్షియల్ రెంటల్ సదుపాయం మరియు 70% లోన్ సౌకర్యం కలదు. సెల్ : 73373 25053
AJT - 6061

WANTED
తిరుపతిలో ఇంటిలో వుంటూ ఇంటి పని, వంట పని చేయుటకు 45సం. లోపు ఆడమనిషి కావలెను. సంప్ర. : నాగిరెడ్డి - 9885791259.
AJT - 6036

WANTED
ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో కమిషన్ పద్ధతిలో పనిచేయుటకు ఉద్యోగులు, నిరుద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు గృహిణులు కావలెను. ఫోన్. 95027 74175/ 74162 11984.
AJT - 6052

REAL ESTATE
తిరుపతి జిల్లా ప్రతి ఏరియాలో మీకు ఫ్లాట్స్ తీసి ఇవ్వబడును మరియు మీ ప్లాట్స్ అమ్మించబడును & అపార్ట్మెంట్స్ ఫ్లాట్స్, లాండ్స్, ఇల్లులు కూడా. Cont. 7997461827
AJT - 6055

చార్ ధామ్ రైలు యాత్ర
హరిద్వార్, యమునోత్రి, గంగోత్రి, కేదార్‌నాథ్, బద్రినాథ్, ఆగ్రా, మధుర తేది.12-06-24. 16రో. టి1కి 32,000/- (రూం+భో) సం.ప్ర. కె.వాసు. నెల్లూరు సెల్: 94913 40504
AJR-156682

కావలెను
మదనపల్లెలో జామియా మసీదు ముందర వున్న H.P. ఆయుర్వేదిక్ & యునాని మెడికల్ స్టోర్‌లో పనిచేయుటకు సేల్స్ గర్ల్ మరియు మార్కెటింగ్ చేయుటకు సేల్స్‌మెన్ కావలెను. సంప్ర. : 73827 34386, 95022 76899
AJT - 179862

FLAT FOR SALE
తిరుపతి, పోస్టల్ కాలనీ 5వ లైన్‌లో "జై రెసిడెన్సి" అపార్ట్‌మెంట్ నందు 3 వ ఫ్లోర్‌లో తూర్పు ముఖం గల 1860 Sft, 3 BHK, 4 Balcony లతో గల ఫ్లాట్ అమ్మకానికి కలదు. (Ready to occupy con: 98496 48496.
AJT - 10259

PLOTS FOR SALE
తిరుపతి - రేణిగుంట, తూకివాకం రోడ్డు, 27x60 (45అం.), 36x60 (60అం.), నార్త్, వెస్ట్ కార్నర్ ప్లాట్స్ 30 అ : రోడ్డుకు హౌస్ ప్లాట్స్ అమ్మబడును. సెల్ : 9110321531
AJT - 6063

WANTED
తిరుపతిలోని పాలు డైరీ నందు ఉదయం 6 నుండి 8 వరకు డెలివరీ చేయడానికి అబ్బాయిలు కావలెను జీతం 5,000 మరియు సాయంత్రం 7 నుండి 9 వరకు డెలివరీ చేయడానికి జీతం 5,000 ఇవ్వబడును. బైక్ తప్పనిసరి సంప్ర. 9030549546
AJT - 179910

WANTED
తిరుపతిలోని మారుతి నెక్సా షో రూమ్ ఎదురుగా రేణిగుంట రోడ్ నందు శ్రీ లక్ష్మి మోటార్స్‌లో పనిచేయుటకు అనుభవం కలిగిన అకౌంటెంట్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సెల్ :9966225242
AJT-179567

PLOTS FOR SALE
తిరుపతికి దగ్గర తక్షణమే ఇల్లు నిర్మాణానికి అనువైన తుడా ఫైనల్ అప్రూవ్డ్ ప్లాట్స్ తక్కువ ధరకే అందుబాటులో కలవు. Cont 82470 75857, 94943 92069.
AJT - 6053

ప్లాట్స్ ఫర్ సేల్
350 ఎకరాలలో TTD దేవస్థానం ఉద్యోగుల ఇళ్ళ స్థలాల దగ్గర, పాగాలి పంచాయతీలో (ఏర్పేడు) హైవేకి ఆనుకొని ఫైనల్ అప్రూవ్డ్ ప్లాట్లు ఫోన్. 95027 74175/ 79959 92114.
AJT - 6051

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647
AJA- 176954

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్ CLASSIFIEDS

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

టీడీపీ-జనసేన ప్రభుత్వమే లక్ష్యం



బీసీ సదస్సులో ఐక్యత చాటుతున్న నాయకులు

కలకడ, ఫిబ్రవరి 3:బీసీలు అందరూ ఏకమై రాష్ట్రంలో తెలుగుదేశం-జనసేన పార్టీలతో కూడిన ఉమ్మడి ప్రభుత్వ ఏర్పాటే లక్ష్యంగా సమష్టి కృషి చేయాలని బీసీ సంఘం నాయకులు ముక్త కంఠంతో పిలుపునిచ్చారు. శనివారం కలకడ పార్టీ కార్యాలయంలో జయహో బీసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి వల్లిగట్ల వెంకటరమణ మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి టీడీపీ బీసీ వర్గాల వారికి వివిధ పదవులను ఇచ్చిందన్నారు. ఈ విషయంలో టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు మాజీ సీఎం స్వర్గీయ నందమూరి తారక రామారావు నాంది పలికితే ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు పరంపర కొనసాగించారని కితాబునిచ్చారు. మరో ప్రతినిధి త్యాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో 26 వేల మందిపై బీసీలపై అక్రమ కేసులు బనాయించి దాడులు జరిపిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ ప్రభుత్వం సాధికారత సమితి ఏర్పాటు చేసి ఒక రూపాయి నిధుల కూడా కేటాయించలేదని విమర్శించారు. జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీసీలకు లబ్ధిచేకూరే 30 రకాల పథకాలను రద్దు చేసిందన్నారు. అన్ని పదవులను ఒకే సామాజిక వర్గానికి ఇచ్చి బీసీలకు అన్యాయం చేసిందన్నారు. బీసీ నాయకుడు జనార్ధన్‌గౌడ్ మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గంలో అభివృద్ధికి చిరు నామా అయిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమా ర్‌రెడ్డిని ఆదరించి గెలిపించాలని కోరారు. అలాగే ముఖ్యమంత్రిగా తిరిగి నారా చంద్రబాబునాయుడును గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్ర మంలో నాయకులు బరకం శ్రీనివాసులరెడ్డి, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, రైస్‌మిల్ రమణ, షబ్బీర్ అహ్మద్, కరీముల్లా, వాటర్‌షెడ్ రవికుమార్, మునాఫ్, ఆనంద్‌రెడ్డి, వేణుగోపాల్, రెడ్డెప్ప, పీరయ్య, ఇర్ఫాన్, ఖాజా, ముబారక్‌అలీ, జిలానీ, రెడ్డిశేఖర్‌లు పాల్గొన్నారు.

సరిహద్దు చెక్‌పోస్టుల తనిఖీ



చెక్‌పోస్టులో తనిఖీ చేస్తున్న ఏఎస్పీ రాజ్‌కమల్

రామసముద్రం, ఫిబ్రవరి 3: రామసముద్రం మండలంలోని సరిహద్దు చెక్‌పోస్టులను జిల్లా అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదట మండలంలోని పోలీస్ కార్యాలయాన్ని సందర్శించి అనంతరం, కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టులను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కర్ణాటక నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి అధిక మొత్తంలో డబ్బు, మద్యం రవాణా అరికట్టడానికి ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్ఐ చంద్రశేఖర్‌ను ఆదేశించారు.

రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య



సోమశేఖర్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

వాల్మీకిపురం, ఫిబ్రవరి 3: వాల్మీకిపురం మండలంలో ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మరువకనే తిరిగి రెండవరోజు శనివారం మరో యువకుడు అదే కోవలో మృతి చెందాడు. మదనపల్లి మండలం ఎస్టేట్ ప్రాంతం టీఎన్ఆర్ కాలనీకి చెందిన పెద్దారెడ్డి కుమారుడు ఎ.సోమశేఖర్ రెడ్డి(27) శుక్రవారం అర్ధరాత్రి వాల్మీకిపురం మండలంలోని చింతపర్తి గ్రామ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కదిరి రైల్వే హెచ్‌సీ బాషా సంఘటనా స్థలానికి చేరుకుని సోమశేఖర్‌రెడ్డి మృతదేహాన్ని వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

11 మంది కోడి పందెం రాయుళ్ల అరెస్ట్

గుర్రంకొండ, ఫిబ్రవరి 3: కోడిపందేలపై పోలీసులు దాడులు నిర్వహించి 11 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. మండలంలోని చెర్లోపల్లి సమీపంలో కోడి పందెం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు చేసి 11 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 7550 నగదు నాలుగు కోడి పుంజులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

దుబాయిలో కలిచెర్లవాసి గుండెపోటుతో మృతి



షబ్బీర్ వలీ (ఫైల్‌ఫొటో)

పెద్దమండ్యం, ఫిబ్రవరి 3: పెద్దమండ్యం మండలం కలిచెర్లకు చెందిన షబ్బీర్‌వలీ(38) దుబాయిలో గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు శనివారం తెలిపారు. షబ్బీర్‌వలీకి భార్య, ఆరుగురు పిల్లలు ఉన్నారు. ఇతను కుటుంబ పోషణకు రెండు నెలల క్రితం దుబాయికి వెళ్లాడు. అక్కడ ఈ నెల 2వతేదీ శుక్రవారం నమాజ్‌కు వెళ్లి తిరిగి రూమ్‌కు వెళ్లిన అనంతరం గుండె పోటు వచ్చి గంట వ్యవధిలోనే కుప్పకూలిపోయి మృత్యు వాత పడినట్లు సమాచారం వచ్చిందని కుటుంబసభ్యులు తెలి పారు. మృత్యువాత పడిన బాధిత కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. ప్రభుత్వం చర్యలు తీసుకొని నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సాగర సంగ్రామ దీక్షను విజయవంతం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 3: సీపీఎస్ రద్దు చేసి జీపీఎస్ అమలు చేయాలన్న డిమాండ్‌తో విశాఖపట్నంలో ఆదివారం నిర్వహించనున్న సాగర సంగ్రామదీక్షను విజయవంతం చేయాలని సీపీఎస్ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక జడ్పీ హైస్కూల్ వద్ద సమావేశమైన సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా కౌన్సిలర్ ఎస్.శ్రీనివాసులు మాట్లాడుతూ సీపీఎస్ విధానం రద్దు చేయాలని ఇప్పటి వరకు 12 సార్లు సీఎం జగన్‌కు విన్నవించినా స్పందన లేదని అందుకే విశాఖపట్నం సముద్రం తీరంలో నిర్వహిస్తున్న సాగర సంగ్రామదీక్షకు ప్రతి ఒక్కరు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగుల సంఘం నేతలు రాజేంద్రకు మార్, రంజిత, భూపతి, శ్రీధర్, విజయ, భాస్కరన్ తదితరులుపాల్గొన్నారు.

హైస్కూల్లోకి పాము.. ఆందోళనలో విద్యార్థులు

ములకలచెరువు, ఫిబ్రవరి 3: మండలంలోని బురకాయలకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోకి శనివారం ఓ పాము రావడంతో విద్యార్థులుతో భయాందోళనతో పరుగులు పెట్టారు. పాఠశాలలో 240 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాల కాంపౌండ్‌వాల్ ముందుభాగం కూలిపోయింది. దీంతో పాఠశాలలోకి తరచూ పాములు వస్తున్నాయి. ఈక్రమంలో శనివారం పాఠశాలలోకి ఓ పాము రావడంతో విద్యార్థులు పరుగులు తీశారు. గమనించిన స్థానికులు పామును చంపేయడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఊపిరి పీ ల్చుకున్నారు. జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ప్రహరీ నిర్మించి పాముల బెడద నుంచి విద్యార్థులకు రక్షణ కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నేడు చింతపర్తిలో టీడీపీ బీసీ సదస్సు

వాల్మీకిపురం, ఫిబ్రవరి 3: మండలంలోని చింతపర్తి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం ఉదయం టీడీపీ బీసీ సదస్సు నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. ఈసమావేశానికి మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పీలేరు మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్‌బాషా, నాయకులు పాల్గొన్నారు.

అది...మెగా కాదు.. దగా డీఎస్సీ

● నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ధ్వజం

పీలేరు, ఫిబ్రవరి 3: రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నిరుద్యోగులను మరోసారి మోసం చేయడానికి మెగా డీస్సీ పేరుతో సీఎం జగన్ మరో సారి మోసానికి తెరతీశారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. తాను అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని నిరుద్యోగులను మభ్యపెట్టారని గుర్తు చేశారు. శనివారం ఆ మేరకు ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో మొత్తం 50 వేల 892 టీచరు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు కేంద్రం గుర్తించిందని, ఇప్పుడు ముఖ్యమంత్రి కేవలం 6 వేల 100 పోస్టుల భర్తీకి డీఎస్సీని నిర్వహిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ విధమైన నోటిఫికేషన్లు ఇవ్వడం నిరుద్యోగులను తప్పుదోవ పట్టించడమేనని స్పష్టం చేశారు. జాబ్ క్యాలెండరు ప్రకటించి 2.32 లక్షల ఉద్యోగాల భర్తీ ఏమైందని ప్రశ్నించారు. ఉద్యోగాలు రాకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా 1745 మంది నిరుద్యోగులు జీవితం మీద విరక్తితో బలవన్మరణాలకు పాల్పడ్డారన్నారు. వచ్చే ఎన్నికల్లో యువత వైసీపీకి బుద్ధి చెప్పాలని కోరారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేషస్పందన

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 3: ఆర్టీసీలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేషస్పందన లభించింది. శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఆర్టీసీ ఉద్యోగులుకు వారి కుటుంబసభ్యులకు మదనపల్లె వన్, టూ డిపోల ఆధ్వర్యంలో మదనపల్లెకు చెందని దృష్టి నయనాధామ, డాక్టర్ అగర్వాల్ ఐ ఆస్పత్రి వారు సంయుక్షంగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఆర్టీసీ ఉద్యోగులు 60మందికిపైగా కంటిపరీక్షల్లో పాల్గొన్నారు. డీపీటీవో రాము, ప్రముఖ సైకాలజిస్ట్ సుధాకర్‌రెడ్డి, వన్, టూ డిపోల మేనేజర్లు వెంకటరమణారెడ్డి, నిరంజన్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 3: రోడ్డు ప్రమాదాలను నివారించాలని ఎంవీఐ టి. శివలింగయ్య సూచించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం మదనపల్లె ఆర్టీసీ గ్యారేజ్‌లో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు రోడ్డు భద్రత నింబంధనలు పాటించాలని తెలిపారు. డ్రైవింగ్ చేసే సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆర్టీసీ ప్రయాణం సురక్షమనే నమ్మకాన్ని కలిగించాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఉందన్నారు. కార్యక్రమంలో మదనపల్లె వన్, టూ సూపర్‌వైజర్లు, డ్రైవర్లు, కండెక్టర్లు, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన సీఐ , తహసీల్దారు

కలికిరి, ఫిబ్రవరి 3: కలికిరి పోలీసు స్టేషన్ సీఐ స్థాయికి అప్‌గ్రేడ్ అయిన తరువాత మొదటి పోలీసు ఇన్‌స్పెక్టరుగా ఆర్. మోహన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లాలో ఎస్ఐగా పని చేస్తూ సీఐగా పదోన్నతి పొంది బదిలీపై కలికిరికి వచ్చారు. ఏఎస్ఐ మధుసూదనాచారి తదితరులు ఆయనకు స్టేషన్‌లో స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నేరుగా రాయచోటి వెళ్ళి డీఎస్పీ మహబూబ్ బాషాను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కాగా కలికిరి తహసీల్దారుగా విజయకుమారిని నియమించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి ఆమెను అన్నమయ్య జిల్లాకు కేటాయించగా జిల్లా కలెక్టరు విజయకుమారిని కలికిరికి నియమించారు.

వాల్మీకిపురం సీఐగా పులి శేఖర్

వాల్మీకిపురం, ఫిబ్రవరి 3: వాల్మీకిపురం నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పులి శేఖర్ శనివారం సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ సురేష్‌కుమార్ కర్నూల్‌కు బదిలీగా కాగా ఆయన స్థానంలో నంద్యాల నుంచి పులి శేఖర్ నూతన సీఐగా విధుల్లో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. అనంతరం స్థానిక పోలీసు సిబ్బందితో సమావేశమై ఎన్నికల వేళ ఎలాంటి సంఘటనలకు చోటు లేకుండా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగేశ్వర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 3: వాల్మీకిపురం పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 5న డీఎస్పీ మహబూబ్‌బాషా సమక్షంలో వాహనాల వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఎస్ఐ నాగేశ్వర్ పేర్కొన్నారు. ఎక్సైజ్ కేసులలో సీజ్ చేసిన ఓ క్వాలీస్ వాహనం, రెండు పల్సర్ ద్విచక్రవాహనాలు వేలం ఉంటుందని, పాల్గొనదలచిన వ్యక్తులు ముందస్తు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

రిటైర్డు ప్రొఫెసర్ మృతికి సంతాపం

మదనపల్లె, ఫిబ్రవరి 3: మదనపల్లెకు చెందిన రిటైర్డు ప్రొఫెసర్ భాగ్యవతి మృతికి జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంఎల్‌సీ డాక్టర్ గేయానంద్ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్డు ప్రొఫెసర్ భాగ్యవతి సామాజిక కార్యకర్తగా, అక్షరాస్యత ఉద్యమనేతగా, ప్రజా సైన్స్ ఉద్యమనేతగా సేవలు అందించారని ఆమె మరణం తీరని లోటన్నారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖులు నివాళులర్పించారు. ప్రొఫెసర్లు రంగయ్య(హైదరాబాద్), మాలకొండయ్య(గుంటూరు), ఓబుల్‌రెడ్డి(అనంతపురం), డాక్టర్ శాంత(గుంటూరు), శివరామి రెడ్డి(అనంతపురం) పకృతి వనం నిర్వాహకులు ఎంసీవీ ప్రసాద్, సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

ములకలచెరువు, ఫిబ్రవరి 3: ములకలచెరువు సమీపంలో శనివారం దాడులు నిర్వహించి ఆరుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. స్థానిక ఇందిరాకాలనీ సమీపంలో జూదం ఆడుతుండగా దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారి వద్ద నుంచి రూ.4,500 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.



రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేధమెక్కడ?

● మరోసారి ఓట్లడిగే అర్హత జగన్‌కు లేదు

● జనసేన నేత రామ్‌దాస్‌చౌదరి విమర్శ



మద్యంషాపు ఎదుట నిరసన తెలుపుతున్న జనసేన నేత గంగారపు రామ్‌దాస్‌చౌదరి

మదనపల్లె, ఫిబ్రవరి 3: రాష్ట్రంలో అంచెలంచెలుగా సంపూర్ణ మద్యపాన నిషేధం చేస్తానని గత ఎన్నికల్లో మాట ఇచ్చి అధికారం చేపట్టాక దాన్ని అమలు చేయకుండా మహిళలను మోసగించారని జనసేన రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామ్‌దాస్‌చౌదరి ధ్వజమెత్తారు. స్థానిక బెంగళూరురోడ్డులోని పప్పిరెడ్డిపల్లె వద్ద మద్యంషాపు ఎదుట నిరసన తెలిపారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలుపుకోలేని జగన్..తిరిగీ 2024 సాధారణ ఎన్నికలకు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారని ఆయన ప్రశ్నించారు. సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేసిన తర్వాతే మీ ముందుకు వచ్చి ఓట్లు అడుగుతానని మహిళలకు చెప్పిన జగన్..ఇప్పుడు మహిళలను ఎలా ఓట్లు అడుగుతారని ఆయన నిలదీశారు. మాటతప్పను, మడమ తిప్పను అని పదేపదే చెప్పే జగన్ నకిలీ, కల్తీ, నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలను హరిస్తున్నారని ఆరోపించారు. పథకాల పేరుతో ప్రజలకు రూ.10ఇచ్చి, రూ.1000 లాగుతున్నట్లు ఆయన విమర్శించారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పిలుపు మేరకు వైసీపీ రహిత ఆంధ్రప్రదేశ్, వైసీపీ రహిత మదనపల్లె, రాజంపేటగా వచ్చే ఎన్నికల్లో ముందుకెళ్లనున్నట్లు ప్రకటించారు. జిల్లా కేంద్రం ఇవ్వకుండా ఇక్కడి ప్రాంత ప్రజల మనోభావాలు, మదనపల్లె ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిలను వచ్చే ఎన్నికల్లో మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు ప్రజలు బుద్ధిచెప్పడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మదనపల్లెను మద్యపాన నిషేధం ఎప్పుడు సీఎం? అని ప్రశ్నిస్తూ సీఎం డౌన్‌డౌన్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరామ్, జనసైనికులు అడపా సురేంద్ర, సనావుల్లా, గ్రానైట్ బాబు, చంద్రశేఖర్, కుమార్, జంగాల గౌతమ్, జనార్దన్, ప్రసాద్, లవన్న, రాజారెడ్డి, నరేష్, పవన్, శంకర్, విజయ్‌కుమార్, గంగులప్ప, జవిలి మోహన్, కృష్ణ, కిశోర్, వీరమహిళలు రెడ్డెమ్మ, సరోజ, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ మోసానికి ప్రజలు మరోసారి గురికావద్దు

జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు



ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు, దారం అనిత

మదనపల్లె, ఫిబ్రవరి 3: ఒక అవకాశం పేరుతో గద్దెనెక్కి అన్ని వర్గాల ప్రజలను వంచించిన వైసీపీ ప్రభుత్వాన్ని ఇక ఇంటికి పంపించాలని నియోజకవర్గ జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు పిలుపునిచ్చారు. జనంకోసం జనసేన కార్యక్రమంలో భాగంగా 52వ రోజు శనివారం స్థానిక ఎన్‌టీఆర్ సర్కిల్ నుంచి నీరుగట్టువారిపల్లె వరకూ ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీరామ రామాంజనేయులు మాట్లాడుతూ మరోఅవకాశం ఇవ్వండంటూ వైసీపీ నాయకులు వస్తున్నారని, మరో మోసానికి గురికావద్దని ప్రజలను కోరారు. రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలన్నా..అన్ని వర్గాల ప్రజల సంతోషంగా ఉండాలన్నా..జనసేన-టీడీపీ ఉమ్మడి ప్రభుత్వాన్ని గెలిపించాలంటూ ఇంటింటా కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి దారం అనిత, పట్టణ అధ్యక్షుడు నాయని జగదీష్, దారం హరిప్రసాద్, కోటకొండ చంద్రశేఖర్, సుప్రీంహర్ష, సీటీఎం గంగాధర్, కొణిదల శంకర్, సోను, నవాజ్, పద్మావతి, చంద్రశేఖర్, శంకర్, మంజుల, జయమ్మ, రెడ్డిరాణి, జనసైనికులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐదేళ్లలో పూర్తి చేయని షాదీమహల్‌పై ప్రేమెందుకో..?

● టీడీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మస్తాన్



మాట్లాడుతున్న టీడీపీ మైనారిటీ నేత ఎస్‌ఏ మస్తాన్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 3: ఐదేళ్లలో మదనపల్లెలోని షాదీమహల్ అభివృద్ధిని పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం ఇప్పుడు కొత్తగా వచ్చిన వైసీపీ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ షాదిమహల్ వద్దకు వెళ్లి ముస్లింలపై ఎనలేని ప్రేమ కురిపిస్తుండడం విడ్డూరమని టీడీపీ మైనారిటి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఏ మస్తాన్ ధ్వజమెత్తారు. శనివారం స్థానిక ఇందిరానగర్‌లోని షాదీమహల్ వద్ద ఆయన మాట్లాడుతూ టీడీపీ పాలనలో ఫైనాన్స్ కమిటీ నుంచి రూ.56లక్షలు నిధులు మంజూరైతే, బిల్లులు పెండింగ్‌పెట్టి పనులు పూర్తి కాకుండా చేస్తున్న మైనారిటీ ప్రజాప్రతినిధి ఎవరో ప్రజలకు తెలుసన్నారు. కేవలం రూ.15 లక్షలు ఖర్చు చేస్తే షాది మహల్ పూర్తవుతుందన్నారు. 95 సెంట్ల మున్సిపల్ భూమిని ముస్లింలకు కేటాయించిన ఘనత టీడీపీ ఎమ్మెల్యే సాగర్‌రెడ్డికి దక్కిందన్నారు. ఓ మున్సిపల్ కౌన్సిలర్ షాదీమహల్ వద్ద ఉన్న దుకాణాల గదుల అద్దెను తీసుకుంటూ మున్సిపాలిటీకి పన్నులు కూడా చెల్లించలేదని మస్తాన్ ఆరోపించారు. ఇప్పుడు పన్నులకు వడ్డీ కలిపి రూ.8లక్షలకు బకాయిలకు చేరిందన్నారు. అక్రమంగా వసూలు చేసిన అద్దెలను వెంటనే మున్సిపాలిటికి జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. టీడీపీ ముస్లిం మైనారిటీ నాయకుడు మహ్మద్ ఖాన్ పాల్గొన్నారు.

ఆడుదాం..ఆంధ్రా పోటీలకు మదనపల్లె విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో జ్ఞానాంబిక కరస్పాండెంట్ గురుప్రసాద్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 3: రాష్ట్రస్థాయిలో జరిగే ఆడుదాం.. ఆంధ్రా క్రీడాపోటీలకు అన్నమయ్య జిల్లా నుంచి మదనపల్లె విద్యార్థులు ఎంపికయ్యారు. శుక్రవారం రాయచోటిలో నిర్వహించిన జిల్లా స్థాయి బాలికల విభాగం క్రికెట్, కబడ్డీ పోటీల్లో మదనపల్లె విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపి ప్రథమ స్థానాల్లో నిలిచారు. స్థానిక రామారావు కాలనీ, ఎస్‌బీఐ కాలనీ సచివాలయాల తరపున ఆడిన జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు రైల్వే కోడూరు జట్టుపై క్రికెట్‌లో 10 వికెట్ల తేడాతో గెలుపొంది కప్పు సాధించారు. అలాగే కబడ్డీ క్రీడలో కూడా రైల్వేకోడూరు జట్టుపై 5 పాయింట్ల తేడాతో గెలిచి కప్పు సాధించారు. శనివారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ మాట్లాడుతూ ఈ రెండు జట్లు అన్నమయ్య జిల్లా తరపున విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయిలో పోటీల్లో పాల్గొంటారన్నారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను ప్రిన్సిపాల్ రమాదేవి, పీడీలు శరత్‌నాయక్, జగదీష్‌లు అభినందించారు.

మదనపల్లె- హైదరాబాదుకు మరో సర్వీసు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 3: మదనపల్లె-హైదరాబాద్‌కు బీహెచ్‌ఈఎల్ మార్గంలో అదనంగా ఆర్టీసీ సర్వీసును ఈనెల 2 నుంచి నడుపుతున్నట్లు వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లెలో సర్వీస్ నెంబరు 5315 గల బస్సు ప్రతిరోజు రాత్రి 8,45కు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7 గంటలకు ఎంజీబీఎస్ చేరుకుని తరువాత 8గంటలకు బీహెచ్‌ఈఎల్ చేరుకుంటుందని చెప్పారు. బీహెచ్‌ఈఎల్‌నుంచి సాయంత్రం 4.45 గంటలకు సర్వీస్‌నెంబరు 5318 గల బస్సు బయలుదేరి ఎంజీబీఎస్‌కు రాత్రి 7 గంటలకు చేరుతుంది అక్కడ నుంచి మదనపల్లెకు మరుసటి రోజు ఉదయం 6 గంటలకు చేరుకుంటుందని డీఎం పేర్కొన్నారు, ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బూర్లపల్లె కృష్ణారెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం



బూర్లపల్లె కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 3 : పీటీఎం మండలం బూర్లపల్లెకు చెందిన సీనియర్ తెలుగుదేశం నేత బూర్లపల్లె కృష్ణారెడ్డి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని రాష్ట్ర మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. ములకలచెరువు మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా, పీటీఎం మండల జడ్పీ టీసీగా, టీడీపీ తెలుగు రైతు రాష్ట్ర కార్య దర్శిగా వివిధ హోదాలలో పని చేసి, టీడీపీ అధినేత చంద్రబాబుకు సైతం సుపరిచితుడైన బూర్లపల్లె కృష్ణారెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఆయన అంత్యక్రియలకు మాజీ ఎమ్మెల్యేలు, లక్ష్మీదేవమ్మ, శంకర్ యాదవ్ లతో పాటు పలువురు ప్రముఖులు హాజరై నివాళులర్పించారు. తాజాగా శనివారం మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి, మదనపల్లె మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ లు బూర్లపల్లెకు చేరుకుని కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడి తమ ప్రగాఢ సాను భూతిని తెలిపారు. పీటీఎం మండల టీడీపీ కన్వీనర్ ఆనంద్‌రెడ్డి, కట్టా సురేంద్ర నాయు డు, మాజీ జడ్పీటీసీ ఈశ్వరప్ప, సంపతికోట కిట్టన్న, భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కట్టా వెంకట్రమణ నాయుడు, సర్పంచ్‌లు చిన్నపరెడ్డి, సురేష్, ఈవీ రమణ, పోతుపేట వెంకటరెడ్డి, గడ్డపార రామకృష్ణరెడ్డి, చావిడి కిట్టన్న, ప్రభాకర్, మస్తాన్‌రెడ్డి ఉన్నారు